



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 98 | మంగళవారం 09 సెప్టెంబర్ 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఓటింగ్‌కు బిఆర్ఎస్, బిజెడి దూరం
- ఇండియా ఫోరం అభ్యర్థికి ఎంఐఎం మద్దతు
- టీడీపీ, వైసీపీల మద్దతు ఎన్‌డిఎకే



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం**

మరికొన్ని గంటల్లో జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. జగదీప్ ధన్‌ఖర్ జులై 21న అకస్మాత్తుగా చేసిన రాజీనామాతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ పదవి కోసం ఎన్‌డిఎ అభ్యర్థి, మహారాష్ట్ర ప్రస్తుత గవర్నరు సిపి రాధాకృష్ణన్, ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి బరిలో నిలిచారు. రహస్య బ్యాలెట్ పద్ధతిన ఉపరాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంట్ హౌస్‌లోని వసుధ రూమ్ నెంబర్ ఎఫ్ 101లో పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజీలో ఉన్న లోకసభ, రాజ్యసభ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. అనంతరం ఎన్నికల ఫలితాలు వెలువరించనున్నారు. రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల వైఖరి ఈ ఎన్నికలలో చర్చనీయాంశమైంది. విభజన నష్టాలను పూడ్చుకోవడంతో పాటు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, పోలవరం నిర్వాసితులు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికోసం కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసి స్పష్టమైన హామీ పొందడానికి ఈ ఎన్నికలు అవకాశం ఇచ్చినప్పటికీ రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్షపార్టీలు ఆ అవకాశాన్ని వదులుకున్నాయి. తెలుగుదేశం, వైసిపిలు పోటీపడి ఎన్‌డిఎ అభ్యర్థికి మద్దతిచ్చిన తీరు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్ష అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి న్యాయమూర్తిగా ఇచ్చిన

- మిగతా 2లో..



# నేపాల్‌లో రణరంగం..

- సోషల్ మీడియాపై నిషేధంతో హింస, 9 మంది మృతి
- ఖాట్మండులో హింసాత్మకంగా మారిన యువత ఆందోళన
- పోలీసుల కాల్పులు.. 9 మంది నిరసనకారుల మృతి, 42 మందికి గాయాలు
- నిషేధంతో పాటు ప్రభుత్వ అవినీతిపై కూడా యువత ఆగ్రహం
- పార్లమెంట్ ముట్టడికి యత్నం.. ఖాట్మండులో కర్ఫ్యూ విధింపు
- ఇతర ప్రధాన నగరాలకూ పాకిన ఆందోళనలు

**నేపాల్– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08**

సోషల్ మీడియా వేదికలపై ప్రభుత్వం విధించిన నిషేధం నేపాల్‌ను రణరంగంగా మార్చింది. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ యువత చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. రాజధాని ఖాట్మండులో సోమవారం జరిగిన నిరసనల సందర్భంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో

- మిగతా 2లో..

## ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై
# కఠిన చర్యలు: సీఎం చంద్రబాబు

- ఉల్లి పంటను కొనుగోలు చేయండి
- సమీక్షలో ముఖ్యమంత్రి ఆదేశం
- సమావేశం నుండే కేంద్రమంత్రికి ఫోన్

**అమరావతి – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08**



ఎరువులను బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎరువుల సరఫరా, ఉల్లి కొనుగోళ్లు, తురకపాలెంలో ఆనారోగ్యం, కాఫీ పంటకు తెగులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రైతులకు యూరియా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు.. ఈ సమావేశం నుండే కేంద్ర మంత్రి జెపి నడ్డాతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడారు. కాకినాడ తీరానికి రానున్న నౌకలో ఏడు రేక్‌ల యూరియాను రాష్ట్రానికి కేటాయించాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇదే విషయాన్ని సమావేశంలోని అధికారులకు చెప్పిన ఆయన దీంతో రాష్ట్రానికి అదనంగా మరో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్లయ్యిదని పేర్కొన్నారు. ఈ అంశంపై కొందరు రాజకీయ దురుద్దేశాలతో చేస్తున్న యత్నాలను నిలువరించాలని సూచించారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించిన రైతులకు ప్రోత్సహకంగా సబ్సిడీని రైతుల ఖాతాల్లోకి జమ చేసే పథకంపై దృష్టి పెట్టి విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పది రోజుల్లో 23,592 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరనుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 80,503 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, అన్ని జిల్లాలకు ఎరువులు సమృద్ధిగా సరఫరా చేస్తామని చెప్పారు. అనంతరం ఉల్లిపంటపై మాట్లాడిన సిఎం ఉల్లి క్వింటాకు రూ.1,200 లకు తక్కువ కాకుండా చూడాలని ఆదేశించారు. ఎవరైనా ఆ ధర కంటే తక్కువకు అమ్ముకుంటే ఆ మేరకు ప్రభుత్వం చెల్లిస్తుందని పేర్కొన్నారు. ఉల్లి పంట ఉత్పత్తి అంచనాల మేరకు నిల్వ చేసేందుకు గోదాములు, కోల్డ్ స్టోరేజీ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ఉల్లిని రైతు బజార్లతోపాటు మార్కెట్‌కు తరలించాలని స్పష్టం చేశారు.

- మిగతా 2లో..



# కోబార్ దీవుల ప్రాజెక్టు గిరిజనుల హక్కుల్ని తుంగలో తొక్కేస్తుంది

- కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08**

గ్రేట్ నికోబార్ దీవుల ప్రాజెక్టు గిరిజనుల హక్కుల్ని తుంగలో తొక్కేస్తుందని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల నికోబార్ ప్రజలు అన్యాయానికి గురవుతారని, ఈ ప్రాజెక్టుతో సున్నితమైన పర్యావరణ వ్యవస్థ దెబ్బతింటుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ద హిందూ ఆంగ్ల పత్రికలో రాసిన ఆర్టిల్‌ను రాహుల్‌గాంధీ సోమవారం సోషల్‌మీడియాలో షేర్ చేశారు. భారత ప్రభుత్వం ట్రాన్స్‌షిప్‌మెంట్ పోర్ట్, అంతర్జాతీయ విమానిశ్రయం, ఎనర్జీ ప్లాంట్, టౌన్‌షిప్, సమగ్ర అభివృద్ధి వంటి లక్ష్యాలతో ఈ ప్రాజెక్టుని నిర్మించనుంది. అయితే

- మిగతా 2లో..



# మోదీ-ట్రంప్ దోస్తీ..

- భారత్‌పై అమెరికా మీడియా ప్రశంసల వర్షం!
- భారత్-అమెరికా మధ్య తగ్గుముఖం పట్టిన ఉద్రిక్తతలు
- చైనాకు వ్యూహాత్మకంగా దూరంగా ఉంటున్నారంటూ మోదీపై ప్రశంసలు
- అమెరికా టారిఫ్‌లను తట్టుకుని దూసుకెళుతున్న భారత స్టాక్ మార్కెట్
- దేశీయ డిమాండ్‌తో పటిష్టంగా భారత సోలార్ పరిశ్రమ
- మోదీ గొప్ప ప్రధాని అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యల ప్రస్తావన

2లో

## ఎవరు అడ్డొచ్చినా
# ఈ పథకం పూర్తి చేస్తాం

- ఉస్మాన్ సాగర్ వద్ద గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన
- నగర ప్రజల దాహార్తి తీర్చడానికే ఈ పథకం తీసుకువచ్చామన్న ముఖ్యమంత్రి
- సమస్యలు సృష్టించినా సమన్వయంతో ముందుకు వెళతామని వ్యాఖ్య



**హైదరాబాద్ – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08**

మూసీ ప్రక్షాళన ద్వారా హైదరాబాద్ నగర ప్రజల తాగునీటి సమస్య పరిష్కారమవడంతో పాటు, నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య కూడా తీరుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మూసీ నది పునరుజ్జీవన కార్యక్రమంలో భాగంగా ఉస్మాన్ సాగర్ వద్ద చేపట్టిన గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్ 2, 3 ప్రాజెక్టు పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హైదరాబాద్ నగర దాహార్తిని తీర్చడానికే గోదావరి తాగునీటి పథకాన్ని తీసుకువచ్చామని తెలిపారు.

వరద నియంత్రణ కోసమే ఉస్మాన్ సాగర్, హిమయత్ సాగర్ జంట జలాశయాలను నిర్మించారని ఆయన గుర్తుచేశారు. తాగునీటి సమస్యల పరిష్కారం

- మిగతా 2లో..



# క్వింటాలు ఉల్లికి రూ.2400 ఇవ్వాలి

- ఉల్లి రైతులపై వెంటనే సిఎం దృష్టి పెట్టాలి
- ఏపీసీసీ అధ్యక్షులు వైఎస్ షర్మిల

**కర్నూలు – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08**

క్వింటాలు ఉల్లికి రూ.2400 గిట్టుబాటు ధర వెంటనే ఇవ్వాలని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆమె కర్నూలు మార్కెట్ యార్డ్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడి వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ ఉల్లి రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో రైతుకు ఎకరాకు రూ.80 వేల నుంచి 1.20 లక్షల వరకు పెట్టుబడి అవుతోందని,

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# ఎవరు అడ్డొచ్చినా ఈ పథకం పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కోసం పీజేఆర్ ఎన్నో పోరాటాలు చేశారని ఆయన స్మరించుకున్నారు. రూ. 7,360 కోట్లతో హ్యామ్ విధానంలో ఈ పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నల్గొండ జిల్లాలో పాదయాత్ర చేసినప్పుడు మూసీ నదిని ప్రక్షాళన చేయాలని ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సమస్యలు ఎదురైనా సమన్వయంతో ముందుకు వెళుతున్నామని అన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని ఆయన పేర్కొన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఈ పథకాన్ని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగకూడదో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. త్వరలోనే మహారాష్ట్రకు వెళ్లి అక్కడి ముఖ్యమంత్రిని కలుస్తానని తెలిపారు.

# ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు: సీఎం చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

కర్నూలు జిల్లా కోడుమూరులో పురుగు మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడిన ఘటనపై సిఎం ఆరా తీశారు. పంటను కనీసం మార్కెట్‌కు తేకుండానే పురుగు మందు తాగినట్లు డ్రామా ఆడిన వ్యవహారంపై చర్యలు తీసుకుంటామని అధికారులు సిఎంకు తెలిపారు. మరోవైపు అరకు కాఫీ పంటకు సోకిన తెగులుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. ఇప్పటికే తెలుగు సోకిన 60 ఎకరాల్లో పంట తొలగించామని, మరో 20 ఎకరాల్లో తొలగింపు ప్రక్రియ కొనసాగుతుం దని అధికారులు సిఎం దృష్టికి తెచ్చారు. తురకపాలెం గ్రామంలో తలెత్తిన ఆరోగ్య సమస్యలపైనా సిఎం అధికా రులకు పలు సూచనలు ఇచ్చారు. వ్యాధికి మూలం ఎక్కడుందన్న అంశాన్ని గుర్తించాలని ఆదేశించారు.

**పౌర సేవల్లో సంతృప్త స్థాయికి ప్రాధాన్యత**

ప్రభుత్వ విభాగాలు అందించే వివిధ పౌర సేవల్లో సంతృప్త స్థాయిపై ఇక ప్రతివారం సమీక్షిస్తానని సిఎం స్పష్టం చేశారు. పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఆర్టీసి, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర శాఖలు అందిస్తున్న సేవలపై ఇంకా సంతృప్త స్థాయి పెరగాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి వ్యక్తం అయ్యే అభిప్రాయాలను డేటా అనలటిక్స్ ద్వారా విశ్లేషించి తగిన నిర్ణయం తీసుకుంటాని తెలిపారు. కొన్ని చోట్ల రాజకీయ కారణాల వల్ల సంతృప్త స్థాయిపై ప్రభావం పడుతుందన్నారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు ఏ మేరకు రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరిగేందుకు ఉపకరిస్తున్నాయన్న అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్‌లో రణరంగం..

(మొదటి పేజీ తరువాయి)

9 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 42 మందికి పైగా గాయపడటంతో దేశవ్యాప్తంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ సహా 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను నిషేధిస్తున్నట్లు నేపాల్ ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా 'హమి నేపాల్' అనే సంస్థ ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, యువకులు సోమవారం ఉదయం ఖాట్మండులోని మైతిఘర్ వద్ద సమావేశమయ్యారు. "సోషల్ మీడియాను కాదు, అవినీతిని మూసేయండి," "మా భావప్రకటనా స్వేచ్ఛను హరించవద్దు" అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జాతీయ జెండాలు చేతబూని, జాతీయ గీతం ఆలపిస్తూ పార్లమెంట్ భవనం వైపు భారీ ర్యాలీగా కదిలారు.

ఆందోళనకారులు పార్లమెంట్ భవనాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బారికేడ్లను దాటుకుని లోపలికి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన నిరసనకారులను అదుపు చేసేందుకు పోలీసులు మొదట టియర్ గ్యాస్, వాటర్ కాననన్లను ప్రయోగించారు. అయినప్పటికీ ఆందోళనకారులు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనతో న్యూ బానేశ్వర్ ప్రాంతం దద్దరిల్లింది. కాల్పుల్లో గాయపడిన వారిని సమీపంలోని సివిల్, ఎవరెస్ట్ ఆసుపత్రులకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 9 మంది మరణించినట్లు సివిల్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహన్ చంద్ర రేగ్మి ధ్రువీకరించారు. సోషల్ మీడియా నిషేధం తమ ఆగ్రహానికి తక్షణ కారణమే అయినప్పటికీ, దేశంలో ఏళ్లుగా పేరుకుపోయిన వ్యవస్థాగత అవినీతే తమ ప్రధాన ఆందోళనకు కారణమని నిరసనకారులు స్పష్టం చేశారు. "ఈ నిషేధం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం. గత తరాలు అన్నీ సహించాయి, కానీ మా తరంతో ఇది ఆగాలి" అని ఇక్షమా తుమ్రోక్ అనే విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లర్ల నేపథ్యంలో ఖాట్మండు జిల్లా యంత్రాంగం నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించింది. రాష్ట్రపతి, ప్రధాని నివాసాలు, సింఘ దర్బార్ పరిసరాల్లో మధ్యాహ్నం 12:30 నుంచి రాత్రి 10 గంటల వరకు కర్ఫ్యూ అమలులో ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఖాట్మండులో మొదలైన ఈ నిరసనలు క్రమంగా దేశంలోని ఇతర ప్రధాన నగరాలకు కూడా వ్యాపిస్తున్నాయి.

# కోబార్ దీవుల ప్రాజెక్టు గిరిజనుల హక్కుల్ని తుంగలో తొక్కేస్తుంది

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రాజెక్టు చేపట్టడం ఒక దుస్సాహసం. గిరిజన హక్కుల్ని తుంగలో తొక్కడం, చట్టపరమైన, చర్చా ప్రక్రియలను అపహాస్యం చేయడమే అని రాహుల్‌గాంధీ ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

కాగా, సోనియాగాంధీ హిందూలో రాసిన ఆర్టికల్‌లో ఈ ప్రాజెక్టు వల్ల నికోబార్ ప్రజలకు, సున్నితమైన పర్యావరణ వ్యవస్థకు జరిగే అన్యాయాన్ని ఆమె ఎత్తిచూపారు. ఈ ప్రాజెక్టు ప్రపంచంలోని అత్యంత ప్రత్యేకమైన వృక్షజాలం, జంతుజాలం నాశనం అవుతుందని, దీంతో ప్రకృతి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉందని సోనియా గాంధీ హైలెట్ చేశారు. రూ. 7,200 కోట్లతో నిర్మించే ఈ ప్రాజెక్టు ఆ ద్వీపంలోని గిరిజన వర్గాల ఉనికికి ముప్పు కలిగిస్తుంది. నికోబారీ గిరిజనుల పూర్వీకుల గ్రామాలు ప్రాజెక్టు ప్రతిపాదిత భూభాగ పరిధిలోకి వస్తాయని అందుకే 2004 హిందూ మహాసముద్ర సునామీ సమయంలో వీరంతా తన గ్రామాలను ఖాళీ చేయవలసి వచ్చిందని ఆమె ఈ ఆర్టికల్‌లో ప్రస్తావించారు. మొత్తంగా ఈ ప్రాజెక్టు గిరిజనులను అక్కడి నుంచే లేకుండా చేసే ప్రయత్నమేనని సోనియా హైలెట్ చేశారు. కేంద్రం ఈ ప్రాజెక్టును నిర్మించడానికి తెచ్చిన షోంపెన్ పాలసీ, గిరిజన తెగకు, వారి సంక్షేమానికి పెద్ద ముప్పును తెస్తుంది. ఎందుకంటే వారు నివసించే భూభాగాన్ని డీనోటిఫై చేస్తుంది. దీంతో వారి ఉనికి, నివాసం ప్రమాదంలో పడుతుంది ఈ అంశాలను కేంద్ర గిరిజన మంత్రిత్వ వ్యవహారాల శాఖ నోటిఫై చేసిందని ఆమె ఈ ఆర్టికల్‌లో పేర్కొన్నారు. గిరిజన హక్కుల్ని పరిరక్షించడానికి స్థాపించబడిన రాజ్యాంగ మరియు చట్టబద్ధమైన సంస్థలు లేవనెత్తే అంశాలను ఈ ప్రక్రియలో పక్కన పెట్టారని సోనియా తెలిపారు.

# నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

తీర్పులను ఎన్నికల ప్రచారంలో సాక్షాత్తు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రస్తావించడం, ఆయనపై వ్యక్తిగత ఆరోప ణలకు దిగడంకూడా దేశవ్యాప్తంగా పలువురి దృష్టిని ఆకర్షించింది. అదే సమయంలో ఎన్‌డిఎ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే పతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆత్మప్రభోదనుసారం ఓటు వేయాలని కోరుతున్నారు. తాజాగా ఇండియా ఫోరం అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి ఎంఐఎం మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసీ ఎక్స్‌లో పోస్టు చేశారు. రహస్య బ్యాలెట్ పద్దతిలో పోలింగ్ జరుగుతుండటంతో ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యులకు విప్ జారీ చేసే అవకాశం లేకపోవడం గమనార్హం. ఎన్నికల ప్రక్రియ గురించి తమ సభ్యులకు వివరించేందుకు ఎన్‌డిఎ, ప్రతిపక్ష పార్టీలు వేర్వేరుగా సభ్యులతో సమావేశాలు నిర్వహించి, మాక్ పోలింగ్ కూడా నిర్వహించాయి. ఎన్‌డిఎ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ తరపున రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఢిల్లీకి చేరుకుని తమ పార్టీ ఎంపిలతో సమావేశమైనారు. మరోవైపు పార్లమెంట్‌లోని సెంట్రల్ హాల్‌లో సోమవారం ఇండియా ఫోరమ్ పార్టీల సభ్యులకు సీనియర్ నేతలు ఎన్నికల ప్రక్రియ గురించి వివరించారు. ఎస్‌పి సీనియర్ ఎంపి రామ్‌గోపాల్ యాదవ్ సభ్యులందరికీ స్వాగతం పలకగా, రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేష్ ఓటింగ్ విధానం గురించి వివరించారు. కాంగ్రెస్ పార్లమెంటరీ నేత సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ఎన్‌సిపి అగ్రనేత శరద్ పవార్, ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్, సిపిఎం నేతలు జాన్ బ్రిట్టాస్, రాధాకృష్ణన్, అమ్రారామ్, డిఎంకె నేత టిఆర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

**మ్యాజిక్ ఫిగర్ 391**

లోక్‌సభ, రాజ్యసభ సభ్యులను కలిపి మొత్తం 788 మంది ఉన్నారు. అందులో రాజ్యసభ నుండి 245 మంది, లోక్‌సభ నుండి 543 మంది ఉన్నారు. అలాగే రాజ్యసభకు నామినేట్ అయిన 12 మంది సభ్యులు కూడా ఓటు వేసేందుకు అర్హులే. రాజ్యసభలో ఆరు సీట్లు, లోక్‌సభలో ఒక సీటు ఖాళీగా ఉండటంతో ప్రస్తుతం ఎలక్టోరల్ కాలేజీ 781 ఓట్లు ఉన్నాయి. అయితే ఉప రాష్ట్రపతి అభ్యర్థి గెలుపొందాలంటే.. మ్యాజిక్ ఫిగర్ కనీసం 391 ఓట్లు అవసరం. బిజెపి నేతృత్వం లోని ఎన్‌డిఎ అభ్యర్థికి మొత్తం 425 మంది సభ్యులు మద్దతు ఇస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థికి 324 మంది ఎంపిల మద్దతు ఉంది. అలాగే ఎన్‌డిఎ అభ్యర్థికి బయటి నుంచి వైసిపి మద్దతు ఇస్తుంది. రాజ్యసభ, లోక్‌సభలో వారికి 11 మంది సభ్యులున్నారు.

**బిఆర్‌ఎస్, బిజెడి దూరం**

ఈ ఎన్నికకు తెలంగాణకు చెందిన కెసిఆర్ నేతృత్వంలోని భారత రాష్ట్ర సమితి (బిఆర్‌ఎస్), ఒడిశాకు చెందిన నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజు జనతాదళ్ (బిజెడి) రెండూ ప్రాంతీయ పార్టీలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. ఇందులో బిజెడికి ఉభయ సభల్లో కలిపి ఏడుగురు ఎంపిలున్నారు. బిఆర్‌ఎస్‌కు కేవలం నలుగురు రాజ్యసభ సభ్యులు మాత్రమే ఉన్నారు. శిరోమణి అకాలీదళ్, జోరమ్ పీపుల్స్ మూమెంట్ (మిజోరం) వంటి పార్టీలకు ఒక్కో సభ్యులున్నారు. అలాగే ఆప్ నుంచి బహిష్కరణకు గురైన స్వాతి మాలివాల్ రాజ్యసభ ఎంపిగా ఉన్నారు. ఆమె ఓటు ఎవరికి వేస్తారనేది ఇంకా స్పష్టత రాలేదు. అలాగే కొంత మంది స్వతంత్రులు ఉన్నారు. వీరు ఎవరికి ఓటు వేస్తారనేది ఆసక్తి నెలకొంది.

**ఎవరేమన్నారు.?**

- 'ఉప రాష్ట్రపతి ఎన్నిక సాధారణంగా చాలా బోరింగ్‌గా ఉంటుంది కానీ ఈసారి అది భిన్నంగా ఉంది' అని రాజకీయ విశ్లేషకులు నీర్జా చౌదరి పేర్కొన్నారు. ఎన్‌డిఎ అభ్యర్థి గెలుపునకు ఢోకా లేకపోయినప్పటికీ క్రాస్ ఓటింగ్ జరిగితే కేంద్ర ప్రభుత్వ బలాబలాల గురించి సందేహాలు చెలరేగుతాయని ఆమె అభిప్రాయ పడ్డారు. 'ఇండియా ఫోరం సంస్థాగత శక్తికి అది నిదర్శనమవుతుంది' అని అమె చెప్పారు. 'అభ్యర్థులందరూ దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వారు.

దీంతో అక్కడి ఎంపిలు ఎలా వ్యవహరిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీలకు కట్టుబడుతారా లేదా అన్నది చూడాల్సిఉంది. ' అని సీనియర్ జర్నలిస్టు విజరు త్రివేది పేర్కొన్నారు. 'ఈ ఎన్నికల్లో పార్టీలు విప్ జారీ చేయలేవు. 1969లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి ఓడిపోయారు. ఇందిరాగాంధీ మద్దతుతో వివి గిరి గెలిచి రాష్ట్రపతి అయ్యారు.' అని మరో సీనియర్ జర్నలిస్టు అనంత్ మిశ్రా గుర్తుచేశారు.

# మోదీ-ట్రంప్ దోస్తీ..

- భారత్‌పై అమెరికా మీడియా ప్రశంసల వర్షం!
- భారత్-అమెరికా మధ్య తగ్గుముఖం పట్టిన ఉద్రిక్తతలు
- చైనాకు వ్యూహాత్మకంగా దూరంగా ఉంటున్నారంటూ మోదీపై ప్రశంసలు
- అమెరికా టారిఫ్‌లను తట్టుకుని దూసుకెళుతున్న భారత స్టాక్ మార్కెట్
- దేశీయ డిమాండ్‌తో పటిష్టంగా భారత సోలార్ పరిశ్రమ
- మోదీ గొప్ప ప్రధాని అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యల ప్రస్తావన

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య తాజాగా చోటుచేసుకున్న సానుకూల పరిణామాలను అమెరికా మీడియా, నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు తగ్గడాన్ని ప్రముఖ నిపుణుడు గోర్డాన్ చాంగ్ స్వాగతించారు. ఈ పరిణామం భారత్, అమెరికా సంబంధాలలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సోమవారం ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ, గేట్‌స్టోన్ ఇన్‌స్టిట్యూట్ సీనియర్ ఫెలో గోర్డాన్ చాంగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "అధ్యక్షుడు ట్రంప్ తన వైఖరిని కొంత మార్చుకున్నారు. ఇది మంచి పరిణామం. ఎందుకంటే మనం భారత్‌ను చైనా వైపు పోనివ్వకూడదు. ప్రధానమంత్రి మోదీ షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సమావేశానికి హాజరైనా, సైనిక కవాతుకు దూరంగా ఉన్నారు. పశ్చిమ దేశాలకు వ్యతిరేక కూటమిలో తాము భాగం కాదనే స్పష్టమైన సందేశాన్ని ఆయన చైనాకు, ప్రపంచానికి పంపారు" అని చాంగ్ వివరించారు. రష్యా నుంచి ముడి చమురు కొంటున్న ఇతర దేశాలను వదిలేసి, భారత్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకుని టారిఫ్‌లు విధించడం అన్యాయమన్న భారత వాదనలో నిజం ఉందని అంగీకరించారు. గత వారం వైట్‌హౌస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ, "ప్రధాని మోదీతో నేను ఎల్లప్పుడూ స్నేహంగానే ఉంటాను. ఆయన గొప్ప ప్రధాని" అని వ్యాఖ్యానించారు. దీనిపై మోదీ వెంటనే స్పందిస్తూ, ట్రంప్ స్నేహభావానికి తాను కూడా అంతే విలువ ఇస్తానని బదులిచ్చారు. మరోవైపు,

అమెరికా టారిఫ్‌ల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై పెద్దగా లేదని ప్రముఖ అమెరికన్ పత్రికలు కథనాలు ప్రచురించాయి. గత ఆరు నెలల్లో ముంబై స్టాక్ మార్కెట్ సూచీలు 10 శాతం పెరిగాయని 'ది న్యూయార్క్ టైమ్స్' నివేదించింది. "భారత మధ్యతరగతిలో పెరుగుతున్న విశ్వాసం, దేశీయ ఆర్థిక రంగం బలపడటమే ఈ వృద్ధికి కారణం" అని ఆ పత్రిక విశ్లేషించింది. భారత మార్కెట్లలో విదేశీ సంస్థల వాటా 24 శాతం నుంచి 16 శాతానికి తగ్గి, దేశీయ పెట్టుబడిదారుల ప్రాబల్యం పెరిగిందని పేర్కొంది.

ఇదే తరహాలో, 'ది లాస్ ఏంజిల్స్ టైమ్స్' కూడా భారత సోలార్ పరిశ్రమపై ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా టారిఫ్‌ల ప్రభావాన్ని తట్టుకునేంత పటిష్టంగా భారత సోలార్ రంగం ఉందని తెలిపింది. "భారత్‌లో సౌర విద్యుత్‌కు విపరీతమైన దేశీయ డిమాండ్ ఉంది. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల వల్ల, అమెరికాలో అమ్మకాలు తగ్గినా ఇక్కడి కంపెనీలకు నష్టం ఉండదు" అని ఆ నివేదిక స్పష్టం చేసింది. గత దశాబ్దంలో భారత్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి 30 రెట్లు పెరిగిందని, దీని ఖర్చు బొగ్గు ఆధారిత విద్యుత్ కంటే సగానికి తగ్గిందని ప్రశంసించింది.

# క్వింటాలు ఉల్లికి రూ.2400 ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

మార్కెట్‌లో క్వింటాలుకు రూ.600 కూడా ఇవ్వడం లేదన్నారు. ఉల్లికి మద్దతు ధర లేక ఇద్దరు రైతులు ఆత్మహత్యా హత్యాయత్నానికి పాల్పడితే వారిని వైసిపి రైతులని రాజకీయం పులిమి కేసులు పెట్టారని విమర్శించారు. ఉల్లి రైతుల మీద సిఎం దృష్టి పెట్టాలని కోరారు. రైతుల కోసం అవసరమైతే నిరాహార దీక్షకైనా సిద్ధమని తెలిపారు. తన కుమారుడు అవసరం వచ్చినప్పుడు రాజకీయాల్లోకి వస్తారని విలేకర్లు అడిగిన ప్రశ్నకు సమాధానంగా షర్మిల చెప్పారు. షర్మిల వెంట మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు, తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల్లో హింసా ప్రవృత్తిని ఉపేక్షించం

## - ప్రొఫెసర్‌పై దాడిని ఖండించిన లోకేష్

**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08**

నూజివీడు ఆర్‌జియుకెటి ప్రొఫెసర్ గోపాలరాజుపై విద్యార్థి వినరు పురుషోత్తం దాడిని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిబంధనల మేరకు వినరును ప్రాక్టికల్ పరీక్షలకు గోపాలరాజు అనుమతించలేదని పేర్కొన్నారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో గురువులది కీలక స్థానమని, విద్యార్థి జీవితాన్ని పాడు చేయాలని ఏ అధ్యాపకుడు భావించరని తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లేమి, హింసా ప్రవృత్తిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.


**అన్నామలైను కలిసిన లోకేష్**

మంత్రి నారా లోకేష్ సోమవారం తమిళనాడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర బిజెపి నాయకులు అన్నామలైను కలిశారు. రాష్ట్రాన్ని సందర్శించాలని కోరారు.

# వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

## - సిఎం చంద్రబాబు

**అమరావతి - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08**



వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పర్యటించి యూరియా లభ్యతపై రైతులకు నమ్మకాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. సచివాలయం నుంచి ఈ అంశంపై జిల్లా కలెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌ను సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో యూరియా లభ్యత సమృద్ధిగానే ఉందని, దానిని సక్రమంగా వినియోగించుకోవాలని ఆదేశించారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే భూసారం దెబ్బతింటుందన్న అంశంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కొందరు రైతులు రబీ కోసం ఇప్పుడే ఎరువులు కొనుగోలు చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రబీ పంట కోసం ముందస్తుగానే ఎరువులు సిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజకీయ ముసుగులో క్రిమినల్ తరహాలో ఆలోచిస్తూ కొందరు ఎరువుల లభ్యత ఉండదన్న అభద్రతా భావాన్ని రైతులకు కల్పిస్తున్నారని, దీనిని నియంత్రించాలని స్పష్టం చేశారు. సీజన్‌లో సాగునీరు ముందుగానే ఇవ్వడం వల్ల పంటల సాగు కూడా ఎక్కువ చేశారని పేర్కొన్నారు. వాణిజ్య పంటలైన ఉల్లి, మామిడి, టమోటా, చీని ఉత్పత్తి ఎక్కువ వచ్చే అవకాశం ఉందని, దీనికి స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు ఉండాలని సూచించారు. మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా సహా విష జ్వరాలు సోకకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## సామాజిక తెలంగాణ సాధ్యమా




తెలంగాణ రాజకీయాల్లో గత పాతికేళ్లలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. కొన్ని రాజకీయ పరిణామాలు సరికొత్త శకానికి తెరలేపగా, మరికొన్ని టీ కప్పులో తుపాను మాదిరి సమసిపోయాయి. పాతికేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ పార్టీ నుంచి బయటకు వచ్చిన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించి సరికొత్త రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. అదే మాదిరిగా ఇప్పుడు ఆయన కుమార్తె కవిత, తండ్రి స్థాపించిన భారతీయ రాష్ట్ర సమితి నుంచి బయటకు వచ్చి, ఆయన మార్గంలోనే నడుస్తూ కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తారా అనే చర్చ మొదలైంది. కేసీఆర్ ప్రస్థానం ఉద్యమపరంగా, రాజకీయపరంగా ఒక చరిత్ర సృష్టించింది. అదే రీతిలో కల్వకుంట్ల కవిత ప్రస్థానం తెలంగాణ రాజకీయాల్లో ఎలా ఉండనుందనే చర్చ నడుస్తోంది. వీరిద్దరి రాజీనామాల పర్వానికి దారితీసిన పరిస్థితులపై ఈ కథనం విశ్లేషిస్తుంది. 2001 వరకు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలుగుదేశం పార్టీలో ఒక సాధారణ నేతగా మాత్రమే గుర్తింపు పొందారు. అయితే తన రాజకీయ సామర్థ్యంతో మంత్రిగా, డిప్యూటీ స్పీకర్ వంటి పదవులను అలంకరించారు. పార్టీలో తనకు తగిన గుర్తింపు లభించలేదన్న భావన, మంత్రి పదవి ఇవ్వలేదన్న ఆగ్రహంతోనే కేసీఆర్ టీడీపీ సభ్యత్వానికి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేశారని కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతారు. మరికొందరు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పదవులను త్యాగం చేశారని అంటారు. ఏది ఏమైనప్పటికీ, టీడీపీకి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసి, 2001లో కేసీఆర్ తెలంగాణ సాధనే తన లక్ష్యమని ప్రకటిస్తూ తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించారు. అప్పటి నుంచి ఆయన ఉద్యమ కార్యాచరణలో, ఎన్నికల రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తూ 2014లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. ఆ తర్వాత 2014 నుంచి 2023 వరకు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించారు. ఇలా ఆనాడు కేసీఆర్ టీడీపీకి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసిన తర్వాత తన రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చవి చూసినా తెలంగాణ రాజకీయాల్లో తనదైన చరిత్రను లిఖించుకున్నారు.అమెరికాలో ఉన్న కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత 2006లో తెలంగాణ రాజకీయాల్లో అడుగుపెట్టారు. అదే ఏడాది తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ అనే లక్ష్యంతో తెలంగాణ జాగృతి అనే సంస్థను స్థాపించారు. బతుకమ్మ పండుగను తెలంగాణ ఉద్యమంలో భాగంగా చేయడంలో ఆమె కృషి చేశారు. 2006 నుంచి తెలంగాణ వచ్చే వరకు అంటే 2014 వరకూ అనేక ఉద్యమ కార్యాచరణలలో ఆమె భాగస్వామిగా ఉన్నారు. 2014లో నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత ఎమ్మెల్సీగా ఉంటూనే ఇటీవలే పార్టీకి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు.పార్టీకి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం, పార్టీ లైన్‌కు భిన్నంగా తెలంగాణ జాగృతి పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం వంటివి ఆమె చేశారు. అయితే పార్టీ సీనియర్ లీడర్ హరీశ్ రావు, మరో కీలక నేత సంతోష్ రావు తనపై కుట్రలు చేశారని, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతికి వారే కారకులని సంచలన ఆరోపణలు చేశారు. దీంతో పార్టీ అధ్యక్షుడు, తండ్రి అయిన కేసీఆర్ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో ఆమె తన పదవులకు రాజీనామా చేశారు. ఇక తన కార్యాచరణ తనది అని ఆమె మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.ఆనాడు కేసీఆర్ రాజీనామా వ్యవహారం, ఈనాడు కవిత రాజీనామా వ్యవహారం చూస్తే, ఇద్దరూ మరో కొత్త రాజకీయానికి తెరలేపేందుకే అన్న పోలిక స్పష్టంగా తెలుస్తోంది. ఆనాడు కేసీఆర్ టీడీపీలో అవమానాలు భరించలేక, పార్టీలో గుర్తింపు లభించకపోవడం, మంత్రి పదవిని ఇవ్వకపోవడం వంటి కారణాల వల్ల టీడీపీకి, డిప్యూటీ స్పీకర్ పదవికి రాజీనామా చేసినట్లు చెబుతారు. కవిత కూడా అదే రీతిలో పార్టీలో అంతర్గత సంక్షోభం, నాయకత్వంపై ఆగ్రహంతోను, తనకు సరైన గుర్తింపు ఇవ్వకుండా కుట్రలు చేస్తున్నారన్న కారణాల వల్లే బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడం జరిగిందని తెలుస్తోంది.అయితే ఆనాడు కేసీఆర్‌కు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అనే ఒక స్పష్టమైన లక్ష్యం ఉంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఆయన రాజీనామా నిర్ణయం తీసుకోవడం వల్ల కొత్త పార్టీ పెట్టి లక్ష్యాన్ని సాధించగలిగారు. కవిత తన భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టత ఇవ్వకపోయినా, 'సామాజిక తెలంగాణ' అనే లక్ష్యం పెట్టుకుని పని చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. తన తండ్రి మాదిరిగానే పార్టీని స్థాపించి, ఆ పార్టీ ద్వారా సామాజిక తెలంగాణ అంటే అన్ని వర్గాల వారికి సమాన వాటా అనే నినాదంతో ముఖ్యంగా బీసీ వర్గాలను ఆకట్టుకునేలా కార్యాచరణ ఉంటుందని తెలుస్తోంది. అయితే తండ్రి బాటలో నడిచి ఆమె సక్సెస్ అవుతారా, ప్రజలు కవిత రాజకీయ ప్రస్థానానికి మద్దతుగా నిలుస్తారా లేదా అన్నది మాత్రం వేచి చూడాలి.

# తటస్థ ఎంపీలపై ఎన్డీఏ గురి

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ఉపరాష్ట్రపతి ఎన్నికకు అంతా సిద్ధమైంది. ఈ నెల 9న ఈ ఉప ఎన్నిక జరగనుంది. ఈ ఎన్నికల్లో అధికార ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్, ఇండియా కూటమి తరపున జస్టిస్ సుదర్శన్ రెడ్డి బరిలో ఉన్నారు. సంఖ్యాబలం పరంగా ఎన్డీఏ అభ్యర్థికి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్నప్పటికీ, తెలుగు వ్యక్తి, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని బరిలోకి దింపడం ద్వారా ఇండియా కూటమి వ్యూహాత్మకంగా వ్యవహరించింది. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక ఆసక్తి కరంగా మారింది. ప్రస్తుతానికి ఎన్డీఏకు గెలుపునకు అవసరమైన సంఖ్యాబలం ఉన్నప్పటికీ, క్రాస్-ఓటింగ్ జరగకుండా, చెల్లని ఓట్లను నిరోధించడానికి ఎన్డీఏ జాగ్రత్తలు తీసుకుంటోంది.




ప్రధానంగా ఈ ఎన్నికలో బీజేపీకి సొంతంగా పూర్తి మెజారిటీ లేకపోవడంతో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జేడీయూ, శివసేన, జేడీఎస్, అప్నాదళ్, ఎల్‌జేపీ వంటి పార్టీల మద్దతు తప్పనిసరిగా మారింది.ఓటింగ్ ప్రక్రియపై శిక్షణ: సెప్టెంబర్ 6-8 వరకు ఎన్డీఏ ఎంపీలకు ఓటింగ్ ప్రక్రియపై శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నారు. బ్యాలెట్‌ను సరిగ్గా ఎలా మార్క్ చేయాలి, ఎన్నికల అధికారి ఇచ్చిన పెన్నునే ఎలా ఉపయోగించాలి, బ్యాలెట్‌ను సరిగ్గా మడతపెట్టడం వంటి విషయాలను వారికి వివరిస్తారు. ఎన్డీఏ ఎంపీలందరూ తప్పకుండా ఓటు వేసేలా చూసేందుకు కేంద్ర మంత్రులు, ఎంపీలను రాష్ట్రాల వారీగా నియమించారు. గెలుపునకు అవసరమైన 391 ఓట్ల కంటే ఎక్కువ, అంటే 436 ఓట్లు తమకు వచ్చే అవకాశం ఉందని ఎన్డీఏ అంచనా వేస్తోంది. వైసీపీ ఇప్పటికే మద్దతు ప్రకటించగా, తటస్థ పార్టీలైన బిజూ జనతాదళ్ (బీజేడీ), బీఆర్ఎస్ మద్దతు కోసం కూడా ఎన్డీఏ ప్రయత్నిస్తోంది.సంఖ్యాబలం లేనప్పటికీ ఇండియా కూటమి తమ అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. సుదర్శన్ రెడ్డి ఇప్పటికే పార్లమెంటు ఉభయ సభల ఎంపీలకు లేఖ రాశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ అంతరాత్మ ప్రబోధానికి అనుగుణంగా ఓటు వేయాలని ఆయన కోరారు. ఆయన ఢిల్లీ, తమిళనాడు, మహారాష్ట్ర, తెలంగాణ, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లలో పర్యటించి ఇండియా కూటమి పార్టీల మద్దతు కోరారు. చాలా విపక్ష పార్టీల అధినేతలు తమ మద్దతు ఆయనకేనని ప్రకటించాయి.ఈ ఎన్నికలో మొత్తం 782 మంది ఎంపీలు ఓటు వేయడానికి అర్హులు. పూర్తి ఓటింగ్ జరిగితే గెలుపునకు కనీసం 392 ఓట్లు అవసరం. ఈ నేపథ్యంలో ఇరు కూటములు తమ అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ప్రధాని మోదీ కూడా సెప్టెంబర్ 8న ఢిల్లీలో ఎన్డీఏ ఎంపీలకు విందు ఇవ్వనున్నారు. ఈ ఎన్నికలు భారత రాజకీయాల్లో కీలక ఘట్టంగా మారనున్నాయి.

# మోడీతో లోకేశ్ భేటీలు..కథ అదేనా

**విజయవాడ - సూర్య వాస్తవం**

ఢిల్లీ కేంద్రంగా ఏపీలో రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. ముఖ్యంగా ఏపీ మంత్రి నారా లోకేష్ తరచూ ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంది. నాలుగు నెలల వ్యవధిలోనే లోకేష్ రెండుసార్లు ప్రధాని మోదీని కలిశారు. అయితే ఒక సాధారణ రాష్ట్ర మంత్రికి ప్రధాని అపాయింట్మెంట్ ఇవ్వడం అనేది ఇక్కడ కీలక పాయింట్. రాష్ట్రాల ముఖ్యమంత్రులకే కలిసేందుకు ప్రధాని అపాయింట్మెంట్ లభించడం కష్టం. అటువంటిది మంత్రి నారా లోకేష్ కు అపాయింట్మెంట్ దక్కుతుండడం వెనుక ఏంటి కథ అనేది ప్రధాన చర్చగా నడుస్తోంది. అయితే లోకేష్ ప్రధానిని కలిసిన ప్రతిసారి రాష్ట్రం కోసమేనని ప్రచారం జరుగుతోంది. తెలుగుదేశం పార్టీ అనుకూల మీడియా సైతం రాష్ట్ర ప్రయోజనాలు, పెండింగ్ ప్రాజెక్టుల కోసమేనని చెబుతూ వస్తోంది. అయితే దాని వెనుక బిజెపి భారీ వ్యూహం ఉందని తెలుస్తోంది.




గతంలో జరిగిన తప్పిదాన్ని తెలుగుదేశం పార్టీ సరి చేసుకునే ప్రయత్నం చేస్తోందని విశ్లేషకుల అభిప్రాయం.తెలుగుదేశం పార్టీ 2019 నుంచి 2024 మధ్య సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంది. 2019 ఎన్నికలకు ముందు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చింది తెలుగుదేశం. అది పరోక్షంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సహాయపడింది. ఎప్పుడైతే చంద్రబాబు ఎన్డీఏ కు దూరమయ్యారు బిజెపికి పరోక్షంగా దగ్గరయ్యే ప్రయత్నం చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అది తెలుగుదేశం పార్టీతో పాటు చంద్రబాబుకు తీవ్ర నష్టం చేసింది. 2018 ఎన్నికలకు ముందు చంద్రబాబు అరెస్ట్ అయ్యారు. 52 రోజులపాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండిపోయారు. ఆ సమయంలో లోకేష్ పడిన తపన అంతా ఇంతా కాదు. ఢిల్లీలో రోజుల తరబడి ఉండిపోయి తండ్రి బెయిల్ కోసం ప్రయత్నించారు. ఆ సమయంలో హోం మంత్రిగా ఉన్న అమిత్ షా అపాయింట్మెంట్ కోసం తెగ ప్రయత్నం చేశారు. కానీ అపాయింట్మెంట్ దక్కలేదు. కానీ ఏడాది తిరిగేసరికి అదే లోకేష్ కు ప్రధాని మోదీ అపాయింట్మెంట్ ఇట్టే లభిస్తోంది.నాలుగు నెలల వ్యవధిలో మంత్రి నారా లోకేష్ ప్రధాని నరేంద్ర మోడీని కలవడం ఇది రెండోసారి. విశాఖ పర్యటనకు వచ్చినప్పుడు.. అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపన సమయంలో కూడా ప్రధాని నరేంద్ర మోడీ.. లోకేష్ ను దగ్గరకు తీసుకున్నారు. ఢిల్లీకి ప్రత్యేకంగా ఆహ్వానించారు. దీంతో లోకేష్ ఈ ఏడాది మేలో కుటుంబ సమేతంగా ఢిల్లీ వెళ్లారు. ప్రధాని నరేంద్ర మోడీతో దాదాపు రెండు గంటలసేపు గడిపారు. తాజాగా మరోసారి ఈరోజు ప్రధాని నరేంద్ర మోడీతో దాదాపు గంట సేపు సమావేశం అయ్యారు నారా లోకేష్. రాష్ట్ర ప్రయోజనాల కోసమేనని.. పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులకు అనుమతి ఇవ్వాలని లోకేష్ కోరినట్లు టిడిపి అనుకూల మీడియా రాసుకొచ్చింది. దానికే అయితే నారా లోకేష్ ఢిల్లీ వెళ్లి ప్రధాని నరేంద్ర మోడీని కలవనక్కర్లేదన్నది ఒక అభిప్రాయం. ఎప్పటికీ సీఎం చంద్రబాబు తో పాటు మంత్రులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు తరచూ వెళ్లి కేంద్ర అధికారులకు కలుస్తున్నారు. కేంద్ర మంత్రులకు కలుస్తుండడంతో ఎప్పటికప్పుడు ఆ ప్రాజెక్టులకు మోక్షం కలుగుతోంది.

ప్రధాని నరేంద్ర మోదీని మంత్రి నారా లోకేష్ తరచూ కలుస్తుండడం వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. ఎవరు అవునన్నా కాదన్నా తెలుగుదేశం పార్టీకి భావి నాయకుడు నారా లోకేష్. గత అనుభవాల దృష్ట్యా బిజెపితో లాంగ్ ట్రావెల్ చేయాలని టిడిపి భావిస్తోంది. మరోవైపు జాతీయ రాజకీయ అవసరాల దృష్ట్యా తెలుగుదేశం పార్టీని శాశ్వత మిత్రుడిగా చేసుకోవాలని చూస్తోంది. ఇలా రెండు పార్టీల పరస్పర ప్రయోజనాల కోసమే ప్రధాని నరేంద్ర మోడీని నారా లోకేష్ తరచూ కలుస్తున్నట్లు తెలుస్తోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# సీఎంకు కొత్త హెలికాప్టర్

**విజయవాడ - సూర్య వాస్తవం**





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భద్రతకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన కోసం అధికారులు కొత్త హెలి కాప్టర్‌ను వాడుతున్నారు. సీఎం రెండు వారాలుగా జిల్లాల పర్యటనలకు ఈ కొత్త హెలికాప్టర్‌లోనే వెళ్తున్నారు. గతంలో ఉన్న పాత హెలికాప్టర్‌కు బదులుగా ఎయిర్‌బస్ హెచ్-160 మోడల్ హెలికాప్టర్‌ను ఎంచుకున్నారు. ఈ కొత్త హెలికాప్టర్ అధునాతన ఫీచర్లతో ఉంది. ప్రతికూల పరిస్థితుల్లో కూడా ప్రయాణించడానికి అనువుగా ఉంటుందని నిపుణులు తెలిపారు. దీనివల్ల సమయం ఆదా అవుతుంది అంటున్నారు.గతంలో వాడుతున్న బెల్ తయారీ హెలికాప్టర్ చాలా పాతది అంటున్నారు. ఆ బెల్ హెలికాప్టర్ ఎక్కువ దూరం ప్రయాణించడానికి పనికి వచ్చేది కాదట. అందుకే కొత్త హెలికాప్టర్‌ను తీసుకున్నారు. పాత హెలికాప్టర్‌లో సీఎం ఉండవల్లిలోని తన నివాసం నుంచి గన్నవరం విమానాశ్రయానికి వెళ్లేవారు. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో గమ్యస్థానానికి చేరకునేవారు. ఆ తర్వాత అక్కడి నుంచి రోడ్డు మార్గంలో కార్యక్రమ వేదికకు వెళ్ళేవారు.ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు తన నివాసం నుంచే హెలికాప్టర్‌లో నేరుగా జిల్లాల పర్యటనకు వెళ్తున్నారు. దీనివల్ల చాలా సమయం కలిసి వస్తుందంటున్నారు.

కొత్త హెలికాప్టర్‌లో పైలట్‌లతో పాటు ఆరుగురు ప్రయాణించవచ్చు. అలాగే ఇది రక్షణ పరంగా కూడా చాలా మంచిది అంటున్నారు. నిపుణులు ఈ హెలికాప్టర్‌ను ఎంచుకోవడానికి కారణం దాని ప్రత్యేక ఫీచర్లే అని చెబుతున్నారు. కొత్త హెలికాప్టర్ వల్ల సీఎం పర్యటనలు వేగంగా జరుగుతున్నాయని.. సమయం ఆదా అవుతుంది అంటున్నారు.ఉంటే.. దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ (విశాఖపట్నం రైల్వే జోన్ జీఎం) సందీప్ మాథుర్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఈ మేరకు అమరావతిలోని సచివాలయంలో సీఎంను కలిసి కొత్త జోన్‌కు సంబంధించి అంశాలపై చర్చించారు. జోన్ కోసం జరుగుతున్న కసరత్తు.. రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న రైల్వే ప్రాజెక్టులు, రూపొందిస్తున్న డీపీఆర్‌ల గురించి సీఎంకు వివరించారు. ఈ క్రమంలో చంద్రబాబు కూడా కొత్త జోన్‌తో పాటూ రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులపై ఆరా తీసినట్లు తెలుస్తోంది.

# రైతులకు ఎరువులు సక్రమంగా అందించాలి

**- తహశీల్దార్ షర్మిలకు వినతిపత్రం అందించిన సీపీఐ పార్టీ**
**- ఎరువుల దుకాణంలలో బ్లాక్ మార్కెటింగ్‌లను అరికట్టాలి**



**పామిడి -సూర్య వాస్తవం,సెప్టెంబర్8:** కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రసాయనిక ఎరువులను సక్రమంగా అందించడంలో విఫలమైందని మండల సీపీఐ పార్టీ సీనియర్ నాయకులు కె రహీం ప్రధాన కార్యదర్శి నాగరాజు పరిచారు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రజల సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)లో రైతుల ఎరువుల సమస్యలపై తహసిల్దార్ షర్మిలకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ సీనియర్ నాయకుడు కే రహీం మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఈ ఏడాది సకాలంలో వర్షాలు రాకపోవడంతో నిరాశతో ఎనిమిది వేల ఎక్టార్లలలో మాత్రమే విత్తనం సాగు చేశారని, వాటికైనను ప్రభుత్వం ఎరువులు సక్రమంగా అందించలేకపోవడం శోచనీయమన్నారు. రైతు సేవా కేంద్రం దగ్గర ఉదయం నుంచి సాయంకాలం వరకు వరుస సంఖ్యలో నిలబడితే చివరికి ఒక్క పాసు పుస్తకానికి ఒక్క బస్తా యూరియా ఇస్తున్నారని, ఒక్కొక్క రైతు 5 నుంచి 10 ఎకరాలు పైబడి సాగు చేశారని అలాంటి వారికి ఒక బస్తా యూరియా కు సరిపడుతుందో ప్రభుత్వాలు చెప్పాలన్నారు. వరి పంట సాగులో ఒకఎకరాకు 4 నుంచి 6 బస్తాల వరకు యూరియా అవసరం అలాంటిది ఒక బస్తా ఇవ్వడం హెూరాది ఘోరమని ఆవేదన వ్యక్తపరిచారు. ఎరువుల దుకాణంకు రైతు వెళ్ళితే బ్లాక్ రేటు చెబుతున్నారని కూటమి ప్రభుత్వానికి రైతాంగం పట్ల అవగాహన లేక రైతులను పూజిస్తూ ఉన్నదని విమర్శనాస్త్రాలు స్పందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను అనుగ్రహించి మండలాన్ని కరువు మండలముగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీకి చెందిన కే రహీం నాగరాజు ఓంకార్ చౌడప్ప ఇమామ్ రాముడు హబీబ్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సభను జయప్రదం చేద్దాం

**- శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్**





**పామిడి-సూర్య వాస్తవం,సెప్టెంబర్ 8** : గుంతకల్లు పట్టణం ఈ నెల 10వ తేదీ బుధవారం రోజు అనంత పురంలో జరగబోయే సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ బహిరంగ సభ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు, గుంతకల్లు మాజీ శాసనసభ్యులు ఆర్.జితేంద్ర గౌడ్ స్వగృహం నందు సోమవారం ఉదయం సమావేశమై పిలుపునిచ్చారు.ముందుగా జితేంద్ర గౌడ్ ,సీనియర్ నేత శ్రీనాథ్ గౌడ్ యువనేతలు పవన్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, అనిల్ గౌడ్ , పలువురు తెదేపా నేతలు ఆలపాటి గారికి పుష్పగుచ్చం అందజేసి ఘనస్వాగతం పలకడం జరిగింది.నాయకులు, కార్యకర్తలతో సమావేశం అనంతరం రాజేంద్ర ప్రసాద్ జితేంద్ర గౌడ్ ఏర్పాటు చేసిన అల్పాహారం భుజించడం జరిగింది. జితేంద్ర గౌడ్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ కార్యక్రమంను విజయవంతం చేస్తామని శాసనమండలి సభ్యులకు హామీ ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుర్రంకొండ మండలంలో

# పిచ్చికుక్క వీరంగం

**మదనపల్లె -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08 :** అన్నమయ్య జిల్లాలోని గుర్రంకొండ మండలంలో పిచ్చి కుక్క వీరంగం సృష్టించింది. ఇంటి ముందు ఉన్న వృద్ధున్ని తీవ్రంగా గాయపరచింది. సోమవారం గుర్రంకొండ మండలంలో చోటు చేసుకున్న ఘటనపై బాధితుని కుటుంబీకుల కథనం ఇలా ఉంది. మండలం లోని చెర్లోపల్లి పంచాయతీ, చిలకుంట పల్లెకు చెందిన ఇ.రెడ్డప్పనాయుడు(70) తన ఇంటి ముందు కూర్చొని ఉండగా, ఎక్కడ నుంచో వచ్చినలో పిచ్చి కుక్క ఒక్కసారిగా వృద్ధినిపై దాడిచేసి, తీవ్రంగా గాయ పరిచింది. కుటుంబీకులు గమనించి బాధితున్ని వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు వెంటనే బాదితునికి మెరుగైన వైద్య చికిత్సలు అందించి అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం, బాదితున్ని తిరుపతి రుయాకు వెళ్లాలని



# సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభ కోసం విస్తృతమైన ఏర్పాట్లు

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**



**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08 :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొనే సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభ కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేపట్టడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం నగరంలోని అనంతపురం - బెంగుళూరు జాతీయ రహదారిలో టాటా మోటార్స్ ఎదురుగానున్న స్థలంలో ఏర్పాటు చేస్తున్న రెండు హెలిప్యాడ్ లలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, సీఎం సెక్యూరిటీ అధికారులు తదితరులు పరిశీలించారు. అనంతరం శ్రీనగర్ కాలనీలో ఉన్న జిఎంఆర్ గ్రౌండ్స్ వద్ద నిర్వహించే సూపర్ సిక్స్ - సూపర్ హిట్ బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి పర్యటన కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, సీఎం సెక్యూరిటీ అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , పలువురు మంత్రులు, శాసన మండలి,శాసన సభ్యులు, డైరెక్టర్లు, తదితర ప్రజా ప్రతినిధులు ఈనెల 10వ తేదీన నగరంలో నిర్వహించే సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభలో పాల్గొనేందుకు వస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీతో కలిసి ముందస్తు ఏర్పాట్ల, సెక్యూరిటీ పరిశీలన చేస్తున్నామన్నారు. హెలిప్యాడ్, ప్రధాన వేదిక, ముఖ్యమంత్రి వెళ్లే రూట్లను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం కోసం చాలా విస్తృతమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఇందుకు సంబంధించి మూమెంట్ ప్లాన్, ట్రాఫిక్, అనంతపురం నగర ప్రజలకు ఇవ్వాల్సిన



సూచనలు రేపు ఇస్తామన్నారు. జిల్లా ఎస్పీ తో పాటు తాను ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ఎవరికీ ఇబ్బంది లేకుండా సజావుగా, ప్రశాంతంగా జరిగేలా అన్ని రకాల ఏర్పాట్లు జిల్లా యంత్రాంగం నుంచి చేయడం జరిగిందని పేర్కొన్నారు. పోలీస్ నుంచి డిజీ వస్తున్నారని, వివిధ ఐపీఎస్ అధికారులు, సీనియర్ అధికారులు అందరూ సెక్యూరిటీ ప్రణాళికను తయారు చేయడం జరిగిందన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రజలు సురక్షితంగా ఇక్కడికి చేరుకోవడం, కార్యక్రమాన్ని చూసుకొని వారు సురక్షితంగా తిరిగి వెళ్లాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం, పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమం నిర్వహించే రోజు చుట్టుపక్కల ఉన్న ప్రజలు పోలీసు వారు ఇస్తున్న ట్రాఫిక్ మూమెంట్, డైవర్షన్ ప్లాన్ ని ఒకసారి గమనించాలని, దాని ప్రకారం ప్రణాళిక వేసుకోవాలన్నారు. జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్, పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ కూడా ఇస్తామని, ఎవరు ఎక్కడైనా ఇబ్బందులు ఎదుర్కొంటే దయచేసి మాకు ఫోన్ చేయాలన్నారు. ప్రభుత్వాసుపత్రులు చుట్టుపక్కల ఉన్నవి, యధావిధిగా పనిచేస్తాయని, ఇందుకు సిబ్బందిని కూడా పెట్టడం జరిగిందని, అప్రమత్తంగా కూడా పనిచేస్తారని, అంబులెన్సులు ఏర్పాటు, ఆసుపత్రికి వెళ్లి వచ్చే దారులు ఎక్కడ కూడా ఇబ్బంది ఉండదని తెలిపారు. అంతకుముందు డిప్యూటీ సీఎం హెలిప్యాడ్ వద్ద కాంపౌండ్ తొలగించి బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్ వద్ద ఉన్న వైర్లు తొలగించాలని, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మంగళవారం కాన్వాయ్ రిహార్సల్స్, ట్రయల్ ల్యాండింగ్ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అహుడా చైర్మన్ టి.సి.వరుణ్, డీఎఫ్ఓ విగ్నేష్ అప్పావు, ఆర్డీఓలు కేశవ నాయుడు, వసంతబాబు, శ్రీనివాస్, జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఈఈ రాజగోపాల్, డిఈ కాటమయ్య, డిపిఓ నాగరాజునాయుడు, సర్వే ఎడి రూప్ల నాయక్, తహసీల్దార్లు హరికుమార్, మహబూబ్ భాష, మండల సర్వేయర్ రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఉనికి చాటుకునేందుకే రైతు పోరుబాట

**-హెరిటేజ్‌లో పాల పదార్థాలు మాత్రమే అమ్ముతారు.. ఉల్లిపాయలు కాదు...?**
**-మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిపై ఆర్ జే వెంకటేష్ ఫైర్...**



**మదనపల్లె -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08 :**వైసీపీ తన ఉనికిని చాటు కునేందుకే రైతు పోరుబాట కార్యక్రమం చేపట్టిందని టిడిపి రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్ జె వెంకటేష్ విమర్శించారు. సోమవారం మదనపల్లె టీడీపీ ఆఫీసులో మీడియాతో మాట్లాడారు. వైసీపీ తన ఉనికిని చాటు కునేందుకే రైతు పోరు కార్యక్రమం చేపట్టిందని, ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు నమ్మరన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి హెరిటేజ్‌లో ఉల్లిపాయలు అమ్ముతున్నారని చెప్పడం విడూ రంగా ఉందన్నారు. హెరిటేజ్ లో కేవలం పాలు, పాల పదార్థాలు మాత్రమే అమ్ముతారని కూడా తెలియకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు.అలాగే యూరియా కొరత ఎక్కడా లేదని రాష్ట్రంలోని ఆయా జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో రైతులకు యూరియాను అందిస్తున్నారని తెలిపారు. ఇకపోతే రైతులకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుం దన్నారు. ఇటీవల మామిడి రైతు నష్టపోతే నాలుగు రూపాయల మద్దతు ధర కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. అలాగే పొగాకు మిర్చి రైతులకు కూడా ప్రభుత్వం ఆదుకునందిని గుర్తు చేశారు. ఉల్లిపాయలను క్వింటాలు 1200రూపాయలతో కొనుగోలు చేయడం జరుగు తుందన్నారు.మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి గతంలో తంబళ్లపల్లె పర్యటనలలో పర్యటించడం జరిగిందన్నారు.టమోటా రైతులను ఆదుకుంటా నని, ధరల స్థిరీకరణ చేపడతా నని చెప్పి తర్వాత రైతులను పట్టించుకున్న పాపాన పోలే దన్నారు. వైసిపి ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధరలు లేక రోడ్లపై టమేటాలు పరబోసిన రోజులు ఎన్నో ఉన్నాయని చెప్పారు. ఇలా రైతుల కష్ట నష్టాలు ఎప్పటి కప్పుడు తెలుసుకొని పక్షపాతిగా కూటమి నిలబడు తోందన్నారు. యథారాజా తథా ప్రజా అన్నట్టు స్థానిక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ నిస్సార్ అహ్మద్ కూడా నిజా నిజాలు తెలుసుకోకుండా కూటమి ప్రభుత్వంపై ఆరో పణలు చేయడం పరిపాటి అయిం దన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ బీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, చాంద్ భాషా ఎక్స్ ఎంపీటీసీ బాలినేని చంద్రశేఖర్ నాయుడు, కృష్ణప్ప, మణి ప్రకాష్, సి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సీపీఎం రైతు సంఘం 9వ మహాసభ



**పామిడి -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 8:** రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది రైతాంగం పూర్తిగా నష్టపోయిందని పండిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకో వలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న విషయం ప్రభుత్వం గ్రహించాలని సిపిఎం పార్టీకి చెందిన జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ భవనంలో సోమవారం నిర్వహించిన రైతు సంఘం 9వ మహాసభల సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన సాగు సకాలం దాటి పోతుందని ఈ ఏడాది అరకొర వర్షాలకే రైతులు విత్తనం సాగు చేశారని సరైన వర్షాలు కురవకపోవడంతో మొలచిన పైరు మొక్కలు గాలికి ముగిస లాడుతున్నాని, గత ఏడాది పండిన పత్తి పంట గిట్టుబాటు ధరలు లేక ఇండ్లలోనే నిలిచిపోయిన పంటను పెట్టుబడులకు తెచ్చిన రుణాల వత్తిడి తాళలేక అతి తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వచ్చినదని, దీనివల్ల రైతు తీవ్రంగా నష్టపోవడంతో పత్తి కంపెనీలకు లాభాల పంట పండిందన్నారు.

ఆగస్టు 15న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ రహితంగానికి అండగా నిలబడతానని ఎర్రకోటపై మూడుసార్లు పదేపదే చెప్పారు. ఆ ప్రసంగం జరిగిన మూడు రోజులకే ప్రతి దిగుమతి శుంకాల తగ్గింపు జీవో ఇవ్వడం మోసపూరితనం అని సెప్టెంబర్ 1,2,3 తేదీలలో సుంకాల తగ్గింపు జీవోని ఉపసంహరించుకోవాలని గ్రామ గ్రామాన రైతు సమావేశాలు జరిపి నిరసన వ్యక్తపరిచామన్నారు.



అయినా కేంద్ర ప్రభుత్వం వైఖరి మానలేదని ఆగ్రహం వ్యక్తపరిచారు. ఇలాగైతే రైతులకు ఆత్మహత్యలు శరణ్యం అవుతాయన్నారు.కావున అనంతపురం జిల్లాని కరువు జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

మునుముందు రైతుల పట్ల పోరాడే కార్యక్రమాలలో రైతులను పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, మండల సిపిఎం సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు తరిమెల నాగరాజు, మండలం ప్రధాన కార్యదర్శి మల్లేశు,రైతు సంఘం కార్యదర్శి ముత్యాలు అధ్యక్షులు చంద్రమోహన్ రెడ్డి, దేవేంద్ర,కార్యకర్తలు శివకుమార్ భాష చాసు, లక్ష్మణ్ కుమార్ సాయి దాసు ఆకుపెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురంలో సూపర్ సిక్స్ విజయోత్సవ సభ

**- వాహనదారులకు పోలీసుల ఆంక్షలు**

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** అనంతపురం పట్టణంలో భారీ ఎత్తున సూపర్ సిక్స్ సభ జరగనున్న నేపథ్యంలో పోలీసులు కీలక సూచనలు చేశారు.. ఈనెల 10వ తేదీన అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ నేపథ్యంలో ఆ ఒక్కరోజు వాహనదారులు ఈకింది ఆంక్షలు పాటించి పోలీసులతో సహకరించాలని కోరారు జిల్లా ఎస్పీ పి.జగదీష్.. సీఎం చంద్రబాబు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు భారీ ఎత్తున ప్రజలు సదరు విజయోత్సవ సభలో పాల్గొనే అవకాశమున్నందున.. వాహనాల రాకపోకలు కొనసాగేందుకు పోలీసు వారు సూచించిన ఆంక్షలు తప్పకుండా పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు ఎస్పీ..




**ట్రాఫిక్ మళ్లింపు..**

హైదరాబాద్ నుంచి బెంగళూరు వైపు వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ నుండి కాకుండా వడియంపేట - బుక్కరాయసముద్రం - నాయనపల్లి క్రాస్ - నార్పల క్రాస్ - బత్తలపల్లి - ధర్మవరం - ఎన్ఎస్ గేట్ - ఎన్ హెచ్-44 మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది..కర్నూల్ నుంచి తిరుపతి/చెన్నై వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ నుండి కాకుండా వడియంపేట - బుక్కరాయసముద్రం - నాయనపల్లి క్రాస్ - నార్పల క్రాస్ - బత్తలపల్లి - కదిరి -మదనపల్లె మార్గంలో ప్రయాణించాలని సూచించారు. బళ్లారి నుంచి బెంగళూరు వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ నుండి కాకుండా చెల్లికేర - తుమ్కూరు - నెలమంగళ - బెంగళూరు మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది.బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ నుండి కాకుండా ఎన్ఎస్ గేట్ - ధర్మవరం - బత్తలపల్లి - నార్పల క్రాస్ - నాయనపల్లి క్రాస్ - బుక్కరాయసముద్రం - వడియంపేట - ఎన్ హెచ్-44 మార్గంలో ప్రయా ణించాలని తెలిపారు.తిరుపతి/చెన్నై వైపు నుంచి కర్నూల్ వెళ్లే వాహనాలు అనంతపురం టౌన్ తప్పించుకుని కదిరి - బత్తలపల్లి - నార్పల క్రాస్ - నాయనపల్లి క్రాస్ - బుక్కరాయసముద్రం - వడియంపేట - ఎన్ హెచ్-44 మార్గంలో ప్రయాణించాల్సి ఉంటుంది.బెంగళూరు నుంచి బళ్లారి వెళ్లే వాహనాలు అనంతపురం తప్పించుకుని బెంగళూరు - నెలమంగళ - తుమ్కూరు - చెల్లికేర మార్గంలో ప్రయాణించాలని ఓ ప్రకటనలో కోరారు అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్..

## ఎరువులు దుకాణంలలో బ్లాక్ మార్కెటింగ్‌లను అరికట్టాలి

**- రైతులకు ఎరువులు సక్రమంగా అందించాలని తహసిల్దార్ బాబురావుకు వినతిపత్రం**
**- సీపీఐ మండల కార్యదర్శి శ్రీరాములు నాయుడు**



**గాండ్లపెంట- సూర్య వాస్తవం,సెప్టెంబర్ 8:** కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు రసాయనిక ఎరువులను సక్రమంగా అందించడంలో విఫల మైందని మండల సీపీఐ కార్యదర్శి శ్రీరాముల నాయుడు సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాల యంలో ప్రజల సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)లో రైతుల ఎరువుల సమస్యలపై తహసిల్దార్ బాబురావుకు వినతిపత్రం అందించారు. ఈ సంద ర్భంగా సిపిఐ పార్టీ శ్రీరాముల నాయుడు మాటా డుతూ.. మండల వ్యాప్తంగా ఈ ఏడాది సకాలంలో వర్షాలు రాకపోవడంతో నిరాశతో వాటికైనను ప్రభుత్వం ఎరువులు సక్రమంగా అందించ లేకపోవడం శోచనీయమన్నారు. రైతు సేవా కేంద్రం దగ్గర ఉదయం నుంచి సాయంకాలం వరకు వరుస సంఖ్యలో నిలబడితే చివరికి ఒక్క పాసు పుస్తకానికి ఒక్క బస్తా యూరియా ఇస్తున్నారని, ఒక్కొక్క రైతు 5 ఎకరాలు పైబడి సాగు చేశారని అలాంటి వారికి ఒక బస్తా యూరియా కు సరిపడుతుందో ప్రభుత్వాలు చెప్పాలన్నారు. వరి పంట సాగులో ఒకఎకరాకు 4 నుంచి 6 బస్తాల వరకు యూరియా అవసరం అలాంటిది ఒక బస్తా ఇవ్వడం హెూరాది ఘోరమని ఆవేదన వ్యక్తపరిచారు. ఎరువుల దుకాణంకు రైతు వెళ్ళితే బ్లాక్ రేటు చెబుతున్నారని కూటమి ప్రభుత్వానికి రైతాంగం పట్ల అవగాహన లేక రైతులను పూజిస్తూ ఉన్నదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను అనుగ్రహించి మండలాన్ని కరువు మండలముగా ప్రకటించాలన డిమాండ్ చేశారు. అదేవిధంగా మండల ప్రజలకు హంద్రీనీవా కాలువ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రెడ్డప్ప, నారాయణ, రామాంజులు, వెంకటరమణ, శ్రీరాములుతదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయి నుంచి ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

**- ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శ్రీవాణి, లావణ్య**



**అనంతపురం రూరల్ - సూర్య వాస్తవం , సెప్టెంబర్ 8:** గ్రామీణ ప్రాంతంలోని ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యం, సంక్షేమం లక్ష్యంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు ఆ శాఖ సూపర్ వైజర్లు శ్రీవాణి, లావణ్య అన్నారు. ఐసీడీఎస్ అనంతపురం రూరల్ ప్రాజెక్ట్ పరిధిలోని ఆత్మకూరులో మిషన్ శక్తి - సంకల్ప్ హెచ్.ఈ. డబ్ల్యూ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ పరీక్షలు సోమవారం నిర్వహించారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహులు మహిళా పోలీసులు అనూరాధ, రేష్మా, మౌనిక, అనూష, శ్వేత, రాణి, మధుప్రియ, అంజుమర్, కుమారి, వరలక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు, పాల్గొన్నారు.

## చౌడేశ్వరి దేవి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ





**పత్తికొండ టౌన్ -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** పత్తికొండ పట్టణం రెడ్డి బావి వీధి లో ఉన్న చౌడేశ్వరి అమ్మవారి రెండవ రోజు ఉత్సవాలలో పాల్గొని పూజలు చేసిన పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ , మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ ,వైస్ సర్పంచ్ పల్లె కళావతి,ఎంపీపీ నారాయణ దాస్, మేధావుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరంగడు, కో -ఆప్షన్ మెంబర్ నజీర్, నూర్ భాష ,మేడం క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు..

## ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆకస్మిక తనిఖీలు





**పామిడి -సూర్య వాస్తవం,సెప్టెంబర్ 8:** పామిడి మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ టీం డి.ఎస్.పి, ఏవో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పామిడిలోని స్థానిక బీసీసీ రోడ్డులో ఉన్న షాప్‌లలో రెండింటిలో ఈ పాస్ మిషన్‌కు అక్కడ ఉన్న స్టాకు తేడాలు ఉండడంతో స్టాప్ సేల్స్ ఇచ్చారు.శ్రీరామ ఫెర్టిలైజర్స్‌లో 28:28:0 - 1,08,000, శివసాగర్ ఫెర్టిలైజర్స్‌లో సూపర్ రూ .18,000 ఫెర్టి లైజర్స్‌ను తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు అమ్మకాలు నిలుపుదల చేయాలని సూచించారు.

## విద్య నేర్పిన ఉత్తమ గురువుకు ఘన సత్కారం





**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** ఉపాధ్యాయ వృత్తిలో ఉత్తమ ప్రతిభ కనపరిచి పాఠశాల విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుల సేవలు అభినందనీయమని తెదేప నేతలు సాయినాథ్ రెడ్డి, రాహుల్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్న వినూతను సోమవారం నాడు ఎస్సీ కాలనీ యూత్ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంజి, కృష్ణన్న, రంగనాథ్ ,రాజేష్ ,ధను, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు బుద్ధి చెప్పినా అసత్య ప్రచారం మానని వైసీపీ నాయకులు

**- రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాలా ప్రసాద్**



విజయవాడ, సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8,సెప్టెంబర్ 8: ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పినా వైసిపి నాయకులు అసత్యప్రచారం చేస్తున్నారని రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి అమ్మినేని జ్వాలా ప్రసాద్ అన్నారు. సోమవారం పత్రిక ప్రక టన ద్వారా జ్వాలా ప్రసాద్ తెలుపుతూ ఆదివారం నాడు మొండితోక జగన్మోహనరావు మాట్లాడుతూ మార్కెఫెడ్‌కి తక్కువ యూరియా కేటాయించి, ప్రైవేట్ దుకాణాలకు ఎక్కువ యూరియా కేటా యించి బ్లాక్ మార్కెట్ లో అమ్మి నాయకుల జేబు లోకి కోట్ల రూపాయలు వెళుతున్నాయని ఆరోపణ చేసారు.మీరు ఈ ఆరోపణను నిరూపిస్తే నేను నందిగామలో గాంధీ బొమ్మ సాక్షిగా క్షమాపణ చెపుతాను అని అన్నారు.మీ ఆరోపణ తప్పని నేను నిరూపిస్తే మీరు ఏమిచేస్తారు.వాస్తవంగా రాష్టానికి వచ్చిన యూరియా లో 70శాతం మార్కెఫెడ్ కి 30శాతం ప్రవేటు వ్యాపారస్తులకు ఇవ్వడం జరిగింది. నందిగామ నియోజకవర్గ మొత్తం 4805 ఎం టి ఎస్ యూరియా వస్తే ,ప్రియతమ నాయకురాలు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కృషితో 3145 , ఎంపీటీఎస్, పిఎసిఎస్, ఏఎంసీ లకు వచ్చాయి. కేవలం1660 ఎం టి ఎస్ మిత్ర మే ప్రైవేట్ వ్యాపారులకు వచ్చాయి.అంటే దాదాపు గా 70 శాతం పిఎసిఎస్ ల ద్వారానే రైతులకు యూరియా అందించటం జరిగింది. అదీకాక ప్రైవేట్ దుకాణాలలో ఉన్న యూరియాను కూడా ఎమ్మెల్యే తంగిరా సౌమ్య ఆదేశాలతో వ్యవసాయశాఖ అధికారి ద్వారా రైతులకు ధరలకు ఇప్పిస్తున్నామని అన్నారు.

## మహిళలు ఐక్యంగా ఉద్యమించాలి

**- ఐద్వా జిల్లా కార్యదర్శి పి.నిర్మల..**




**పత్తికొండ టౌన్ -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో మహిళలపై జరుగుతున్న అరాచకాలపై మహిళలందరూ ఐక్యమై ఉద్యమించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.నిర్మల పిలుపునిచ్చారు. సోమవారం పత్తికొండ పట్టణంలోని కామ్రేడ్ ఈశ్వర్ రెడ్డి భవనంలో మహిళ మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐద్వా జిల్లా కార్యదర్శి పి .నిర్మల, సిఐటియు జిల్లా నాయకులు గౌస్ దేశాయ్ పాల్గొని మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో మానవ మృగాలు తాగుడుకు బానిసై మహిళలపై గృహహింస, వరకట్న వేధింపులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను తక్షణమే ప్రభుత్వాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. పార్టీలకతీతంగా మహిళలందరూ ఐకమై సమస్యలను పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, సిఐటియు మండల కార్యదర్శి యం. రవిచంద్ర, వ్యవసాయ సంఘం నాయకులు నరసన్న బుజ్జులు ప్రజానాట్యమండలి రమేష్ మంజు తదితరులు పాల్గొన్నారు.




## ఉపాధ్యాయ దినోత్సవ కార్య క్రమాన్ని ఘనంగా నిర్వహించిన పెన్షనర్స్ అసోసియేషన్ గుత్తిశాఖ



**గుత్తి -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** గుత్తి ఫుట్బాల్ గ్రౌండ్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల గుత్తి శాఖ ఆధ్వర్యంలో తాలుకా అధ్యక్షుడు అబూబాకర్ అధ్యక్షతన మరి యు,కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు ఆధ్వర్యంలో ఉదయం 11.00 గంటలకు పెన్షనర్స్ భవనము నందు ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కా ర్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉపఖజానా అధికారి అయిన సురేష్‌బాబు హాజరయ్యారు. విద్యా రంగానికి సేవలు అందించిన కొం తమంది ఉపాధ్యాయులను స న్మానించారు. సన్మా నించిన వారిలో జె.జె.మనోరంజిత,సి.హెచ్. రూత్, దుర్గమ్మ, గోవిందు, లక్ష్మీ నా రాయణరెడ్డి వీరి సేవలను కొని యాడారు.వీరికి శాలువ కప్పి, బొ కేలు అందించి వీరి సేవలు సమా జసేవకు ఉపయోగ పడాలని ఆ యురారోగ్యాలతో ఉండాలని అ భినంది ంచడమైనది. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ అబూబాకర్, అసోసియేట్ ప్రెసిడెంట్ స్వర్ణాం బ,ఉప ఖజానా అధికారి సురేష్ బాబు,కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు ,పెన్షనర్స్ సభ్యులు పాల్గొ న్నారు.

## హత్య కేసులో ముద్దాయి అరెస్ట్



**గాండ్లపెంట-సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** మండల పరిధిలోని తూపల్లి గ్రామంలో నివాసముంటున్న కుటాగుళ్ళ మన్సూర్ (38) భార్య మెహతాజ్ (30) ఆమెను ప్రతి రోజు అనుమానిస్తూ ఆమెను దూషిస్తూ హింసించేవాడు, అయితే ఈ నెల 6వ తేదీ తన నివాసంలోని బెడ్ రూమ్లో ఆమెను గోకుల బండతో కొట్టి హత్య చేసి పరారైన విషయం తెలిసినదే ఈ విషయంపై పోలీసులు ముద్దాయిని వెతుకుతుండగా సరైన సమాచారం తో ఎనిమిదో తేదీ ఘుద్దాయిని పట్టుకుని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసామని సిఐ నాగేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవికుమార్, పి సి రవి కుమార్, పీసీ సోమశేఖర్ పాల్గొన్నారు.

# భద్రతా చర్యలు పక్కాగా చేపట్టండి: డీజీపీ

## -సూపర్ సిక్స్ - సూపర్ హిట్ విజయోత్సవ సభ భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీజీపీ





**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** ఈనెల 10వ తేదీన అనంతపురం ఇంద్రప్రస్థా మైదానంలో సూపర్ సిక్స్ – సూపర్ హిట్ విజయోత్సవ సభ నిర్వహిం చనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవణ్ కళ్యాణ్ పాటు రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు భారీగా ప్రజలు పాల్గొననున్నారు.ఈ నేపథ్యంలో విజయోత్సవ సభకు విచ్చేసే ప్రతీ ఒక్కరికి భద్రతా చర్యలు పక్కాగా చేపట్టేలా డిజిపి ఆదేశాలు జారీ చేశారు.సభాస్థలి, హెలీ ప్యాడ్, పార్కింగ్ స్థలాలు, తదితర ప్రదేశాలను అడిషనల్ డి.జి (లాఅండ్ఆర్డర్) ఎన్.మధు సూదన్‌రెడ్డితో కలసి డిజిపి ఈరోజు సందర్శించి భద్రతా ప్రమాణాలను లోతుగా చెక్ చేశారు. అనంతపురం రేంజ్ డి.ఐ.జి డాక్టర్ షిమోషి ,జిల్లా ఎస్పీ పి.జగదీష్ చేపట్టనున్న బందోబస్తు చర్యలను డిజిపికి వివరించారు. ఆపరేషన్స్ ఐజిపి సి.హెచ్ శ్రీకాంత్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు వెంట వెళ్లారు.

# మైక్రో ఫైనాన్స్‌తో దోచేస్తున్నారు




**ఖమ్మం – సూర్య వాస్తవం:** పినపాక నియోజక వర్గం పారిశ్రా మికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాం తం ఇక్కడ పలుపరిశ్రమలు, సింగరేణి సంస్థ లున్నాయి. వేలాది మంది పేదలు ఆయా పరిశ్రమలలోకి పనులకు వెళుంటారు. పేద, దిగువ మధ్య తరగతి, ఆదివాసి జనాభా గణనీయంగా ఉన్న ఏజెన్సీ ప్రాంత గ్రామాల పై మైక్రో ఫైనాన్స్ సంస్థలు గురి పెట్టాయి. పదేళ్ల క్రితం పేద కుటుంబాలను చిన్నా భి న్నం చేసిన సంస్థలు ఇటీవల కాలంలో తిరిగి మళ్లీ చాపకింద నీరులా తమ వ్యాపార కార్యక్రమాలనుమొదలు పెట్టాయి. దీంతో గ్రా మాల్లో మళ్లీ మైక్రో ఫైనాన్స్ (సూక్ష్మ వడ్డీ వ్యాపారం) పడగ విప్పుతూ అధిక వడ్డీలతో పేదలపై బుస కొడుతున్నాయి. అమాయక పేద ప్రజల అవసరాలే ఆసరాగా అధిక వడ్డీలకు రుణాలిచ్చి వారి నడ్డి విరుస్తున్నాయి. పోటా పోటీగాపాగా.. అడ్డగోలు వసూళ్లు చేస్తున్నారు. స్పందన, కీర్తన,అన్నపూర్ణ ,బంధన్, ముథూట్, బజాజ్, పిన్ కే ర్, ఐఐ ఎఫ్ఎల్ ఇలా పేర్లు వేరై నా మైక్రో ఫైనాన్స్ వ్యాపారమే వారి లక్ష్యం. పదుల సంఖ్యలో గ్రామా లలో కార్యాలయాలను ఏర్పాటు చేసుకొని పాగా వేశాయి. అవి రూ.8 వేల నుంచి రూ .50 వేల వరకు మహిళలకు రుణాలు ఇస్తున్నాయి. పేద, మధ్య తరగతి జనాలే టార్గెట్ గా చేసి, ఐదు నుంచి పది మంది.సభ్యులతో గ్రూపులు ఏర్పాటు చేసి ఎలాంటి షూరిటీ లేకుండానే ఆధార్,పాన్ కార్డుల తోనే లోన్లు ఇస్తూనే దగాకు తెరలేపుతున్నాయి. ఒక సభ్యురాలికి రూ.50 వేలు అప్పు ఇచ్చే సమయంలోనే ప్రాసెసింగ్ ఫీజు, డాక్యుమెంటేషన్,ఇన్సూరెన్స్ పేర్లు చెప్పి రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు కోత పెడుతున్నాయి. అవసరాన్ని బట్టి వందకు రూ.3 నుంచి రూ.5 చొప్పున వడ్డీవసూలు చేస్తున్నాయి. కిస్తీ లేటైతే రోజుకు రూ. వంద చొప్పున ఫైన్ వసూలు చే స్తున్నాయి. దీంతో పేదలు వాటిని ఆశ్రయించి అధిక వడ్డీలకు బలవుతున్నారు.కొన్ని మైక్రో ఫైనాన్స్ సంస్థలు అ మాయక మహిళలకు రుణాలు ఇచ్చి వారి నుంచి వాయిదాల రూపంలో వడ్డీ డబ్బులనుఅధికంగా వసూలుచేస్తున్నాయి. ఒకటి, రెండు రోజులు వడ్డీ చెల్లింపులు ఆలస్యమైతే పెద్ద మొత్తం లో జరిమానాలు విధిస్తూ వారి నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నాయి. అధిక వడ్డీపై మహిళలు ప్రశ్నిస్తే సంస్థల ప్రతి నిధులు దురుసుగా ప్రవర్తిస్తు, మహిళలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రుణాలు తీసుకున్న వారితో పాటు గ్యారెంటీగా ఉన్న వారిని వేధింపులకు గురి చేయడంతో కొంత మంది వీరి ఆగడాలు భరించలేక గ్రామాలను వదిలి వెళ్లిన సంఘటనలువెలుగు చూస్తున్నాయి. కొడుకు చదువు.. కూతురి విదేశీ విద్య.. లేక పెళ్లి ఇంకా ఆసుపత్రి ఖర్చులు.. లేదా పెట్టుబడులు అవసరం ఏదైనా ఆదుకోడానికి మేమున్నా మంటూ అండగా నిలుస్తారు. అవసరం ఎంతైనా సాయం చేస్తారు. వారం వారం చెల్లించాలంటూ సున్నితంగా చెబుతారు. వారి వలలో పడితే ఇక అంతే సంగతులు.. చెల్లింపు ల్లో ఏమైనా తేడా జరిగిందా పరువు గోవిందా.. కుటుంబం పరువు నిండా గంగలోకలిసిపోయినట్టే. ఇలా పరు వుకు భయపడి మళ్లీ వాళ్లదగ్గరే ఇంకొంచం పెద్ద మొత్తంలో వడ్డీకి తీసుకుని ఆ అప్పును తీర్చడానికి కొత్త అప్పు చేస్తూ , వాటికి వడ్డీలు ఆపైన చక్రవడ్డీలు అపరాధ రుసుంలుచెల్లిస్తూ చివరకు ఆర్థికంగా నష్టపోతున్నారు. సిబ్బంది వసూళ్ల కోసం తమ ప్రాంతాల్లోకి వస్తున్నారంటేనే రుణాలు తీసుకున్నవారు వణికిపోతు న్నారు.

ఇక్కడి గిరిజనంలో ఉన్న అమాయ కత్వాన్ని ఆసరా చేసుకుని తక్కువ వడ్డీ పేరిట అప్పులు అంటగట్టడం, ఆనక చెల్లించలేక సతమతమౌతున్న పరిస్థితుల్లో గ్రూపు లో ఉన్న ఇతరుల నుంచి వత్తిడి పెట్టడం.. పరువు తీస్తా మంటూ బెదిరింపులకు పాల్పడడం షరా మామూలుగా మారింది. గతం లో ఈ మైక్రో ఫైనాన్స్ సంస్థలపై ప్రభుత్వం నిషేధం విధించి నప్ప టికీ.. మారిన పరిస్థితుల్లో సరళీ కరణ ముసుగులో మళ్లీ సూక్ష్మ రుణ సంస్థల వసూళ్ల పర్వం కొనసాగుతునే ఉంది. ఉన్నఫళం గా అప్పు ఇస్తుండడమేసమాన్యులు వీరి పాలి ట పడి బలై పోవడానికి మార్గంగాఉంది. ఏజెన్సీ ప్రాంతంలో ఎలాంటి అనుమతులులేకుండానే కోట్ల రూపాయల లావాదేవీలు జరుపుతూ స్థానికంగా గ్రామాల్లో బోర్డులు పెట్టి మరీ తమ కార్యకలాపాలు నిర్వహిస్తుండడం గమనార్హం.

### అందమైన ఆహారం వెనుక..

# అంతులేని కల్తీ ఆహార విక్రయం



**హైదరాబాద్ –సూర్య వాస్తవం:** నోరూరించే రుచికర ఆహారం తిందామని హోటల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు ఆశ్రయిస్తున్న ప్రజల ఆరోగ్య చెలగాటమాడుతూ వ్యాపారం నిర్వహిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు హోటల్లు ఫాస్ట్ ఫుడ్ నిర్వాహకులు. ఉప్పల్ నియోజకవర్గంలోని పెద్ద పెద్ద హోటల్ నుంచి చిన్న చిన్న హోటల్లు రెస్టారెంట్ ఫాస్ట్ సెంటర్లు అందరూ ఒకటే బాటగా నాణ్యత లేని ఆహార పదార్థాలు వంటకాలు తయారుచేసి అధిక ధరలకు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు మల్లాపూర్ నాచారం చిల్కానగర్ ఉప్పల్ ప్రాంతాలలో రోడ్ సైడ్ ఫుడ్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కుప్పలు తెప్పలుగా ఎక్కడపడితే అక్కడ పెట్టి నాణ్యత లేని ఆహార పదార్థాలు తయారు చేస్తూ అనారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. శుభ్రతను గాలికి వదిలేసి ప్రధానంగా మాంసాహారం విక్రయాలను నిర్వహించి హోటలు రెస్టారెంట్లు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొంతమంది యజమానులు లైవ్ లో మటన్ చీకులను స్వయంగా కొనుగోలు చేసి వాటిని తమ తమ హోటల్ రెస్టారెంట్ విక్రయిస్తూ 80 శాతం నిబంధనలు పాతర వేసి వంటకాలు తయారు చేస్తూ భోజనం భోజన ప్రియులకు షాక్ ఇస్తున్నారు.రంగు సాసులతో కలిపి వంటకాలు చూస్తూ వారి బిల్లు చెల్లించి వెళ్తున్నారు. పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు కల్తీ ఆహార విక్రయాలపై అటు జిహెచ్ఎంసి కానీ నిఘా పెట్టాల్సిన విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు కానీ వీటి జోలికి వచ్చిన దాఖలాలే లేవు. చనిపోయిన రోగాల బారిన పడిన గొర్రె మేక మాంస విక్రయాలు భారీ ఎత్తున జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వివరిస్తున్నారని ఆరోపలు సైతం వినపడుతున్నాయి. చనిపోయిన మేక కోడి మాంసాలను ఫ్రిజ్లో నిలువ నిలువ చేస్తూ ఆయా మటన్ చికెన్ లతోనే ఆహార వంటకాలు తయారుచేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నాయి ఈ ఫాస్ట్ ఫుడ్ రెస్టారెంట్లు. చిన్న చిన్న హోటల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు రోడ్ సైడ్ వ్యాపారాలు సాగించేవారు ఆహార పదార్థాలకు తమదైన స్టైల్ లో పేర్లు పెట్టి భోజనం లేని ఆకర్షిస్తూ నాణ్యతలేని భోజనానికి సప్లై చేస్తూ ప్రజలు అనారోగ్య బారిన పడుతుంటే వీరు మాత్రం నాణ్యతలేని భోజనాన్ని పెట్టి జేబులు నింపుకుంటున్నారు. అసలే వేసవి కాలం రావడంతో రంగురంగులుగా కలర్లు సాసులతో ఫాస్ట్ ఫుడ్ తయారుచేసి సప్లై చేయడం వల్ల ఫాస్ట్ ఫుడ్ ప్రియులు అనారోగ్యపాలు పడుతున్నారని పలువురు వాపోతున్నారు.చిన్నపిల్లల నుండి పెద్దవారి వరకు ఫాస్ట్ ఫుడ్ మీద ఆకర్షణ పడేవిధంగా ఫాస్ట్ ఫుడ్ యజమాన్యాలు కలర్లను సాసులను తో ఆకర్షిణించే విధంగా చేయడం ద్వారా సాయంత్రం కాగానే ఫాస్ట్ ఫుడ్ లకు క్యూ కడుతున్నారు ప్రజలు. ఫాస్ట్ ఫుడ్ ఆహారం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నప్పటికీ వీరు చేసే మాయాజాలంతో ప్రజలు ఆకర్షితులై ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై నిఘా కొరవడంతోనే కుప్పలు తెప్పలుగా ఫస్ట్ ఫుడ్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయని మరికొందరు ఆరోపిస్తున్నారు. నాచారం మల్లాపూర్ నాచారంఉప్పల్ ప్రాంతంలోనే దాదాపు 200 పైగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ ఉన్నాయంటే పరిస్థితి ఏమైపోయిందో ఎట్టా అర్థమవుతుంది. హోటల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో శుభ్రత నాణ్యత పరిశీలించాల్సిన అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడమే వలనే వీళ్ళ ఆగడాలకు హద్దు అదుపు లేదంటూ మరికొందరు ఆరోపిస్తున్నారు ఇకనైనా అధికారులు స్పందించి నాణ్యత లేని ఆహారం సప్లై హోటల్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఇమామ్ మౌజన్‌ల గౌరవ వేతనాలు వెంటనే అందించాలి

- వైయస్సార్ కాంగ్రెస్ మైనార్టీ విభాగం





**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** ఇమామ్ ,మౌజన్ గౌరవ వేతనాల కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ ఇమామ్ మరియు మౌజాన్ లకు తోడుగా ఎన్టీఆర్ జిల్లా వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందించే కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మైనార్టీ ప్రతినిధులతో జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ పోస్టర్ రిలీజ్ చేవారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ ఇమామ్ , మౌజన్ గౌరవ వేతనాలను తక్షణమే రిలీజ్ చేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అన్నారు.చంద్రబాబు పాలనలో ప్రతి పేదవాడు ఇబ్బంది పడుతున్నారు అన్నారు.ఎన్నికల ముందు మైనార్టీలకు మోసపూరిత హామిలు ఇచ్చి,ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదు అన్నారు.ఈ కార్యక్రమంలో ముస్లింలు సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత పోరు.. రైతు బాసటగా వైఎస్సార్సీపీ



**పెళ్లకూరు–సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08:** రైతు సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు ర్యాలీ నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ నెల సెప్టెంబర్ 09వ తేదీ ఉదయం 9 గంటలకు సూళ్లూరుపేట పట్టణంలో ఈ కార్యక్రమం జరగనుంది.సూళ్లూరుపేట నియోజ కవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ ఇన్చార్జ్ కిలివేటి సంజీవయ్య, మాజీ ఎన్డీసీబీ చైర్మన్, రాష్ట్ర వైఎస్సార్సీపీ కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ చేపట్టనున్నారు.పెళ్లకూరు మండలంలోని ప్రతి పంచాయతీ నుండి రైతులు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతులకు రావలసిన ఇన్పుట్ సబ్సిడీ, యూరియా సబ్సిడీ, విత్తనాలు, జీలగలు, రైతు సామాగ్రి తదితర అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసు`కెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.ర్యాలీ అనంతరం దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆపై ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని యూరియా బ్లాక్ మార్కెట్ సమస్యలు, గిట్టుబాటు ధరలు వంటి రైతు సమస్యలపై ఆర్డీవోకి మెమొరాండం సమర్పించనున్నారు.రైతు సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్క రైతు ముందుకు వచ్చి ఈ పోరాటంలో భాగస్వామ్యం కావాలని కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి కోరారు.

### అన్నదాత పోరు కార్యక్రమాన్ని

## విజయవంతం చేద్దాం

- రైతులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో తరలి రండి
- సూళ్లూరుపేట పట్టణంలోని వినాయకస్వామి ఆలయం వద్ద నుంచి ర్యాలీ
- మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య పిలుపు




**నాయుడుపేట –సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08:** రాష్ట్రంలో యూరియా కొరతతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమ స్యలపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగే అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కిలివేటి సంజీవయ్య పిలుపునిచ్చారు.సూళ్లూరుపేట పట్టణంలోని వినాయకస్వామి ఆలయం వద్ద నుంచి ర్యాలీగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద నివాళులు అర్పించి ఆర్డీఓ కార్యాలయం వరకు నిర్వహించే ర్యాలీలో రైతులు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయా లన్నారు. మంగళవారం ఉదయం 9గంటలకు వినాయ కస్వామి ఆలయం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై యూరియా కొరత, రైతుల సమస్యలపై ఆర్డీఓకు వినతిపత్రం అందించడం జరుగుతుందన్నారు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య.

## కుప్పం పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం





**కుప్పం -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** కుప్పం ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి, కుప్పం శాసనసభ్యులు నారా చంద్ర బాబు నాయుడు కంకణం కట్టు కున్నారు. ఆయన ఆదేశాలతో సోమ వారం అభివృద్ధి పనులకు ఆ పార్టీ నేతలు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సారథ్యంలో కుప్పం మున్సిపాలిటీ ప్రధాన రహదారైన నేతాజీ రోడ్డును విస్తరించే క్రమంలో ఆక్రమణలను తొలగించే పనులను మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ల జిమ్ దాము, మైనార్టీ అధ్యక్షుడు జాకీర్,కౌన్సిలర్లు, సోమశేఖర్,జగదీష్, సోము, మాజీ గంగమ్మ గుడి చైర్మన్ ఆర్ ఆర్ రవి, మాజీ ఎంపీటీసీ ఉమాపతి, కడ సలహామండలి సభ్యులు, మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యేంద్ర శేఖర్, ఇంచార్జ్ కన్నన్ కొత్తపేట ఇంచార్జ్ అప్పు, మహిళా నేతలు తిరుమగళ్, శారదమ్మ ,తెలుగుదేశం,జనసేన బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ బీజేపీ జనసేన వారు రాయలసీమకు న్యాయం చేయాలి

**- వైసీపీ గ్రీవిన్స్ సెల్ అనంతపురం జిల్లా అధ్యక్షులు బాకే హాబీబుల్లా**



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** భారతదేశంలోనే అత్యంతతక్కువ వర్ష పాతంతో ఎడారిగా మారుతున్నా అనం తపురం జిల్లాకు వస్తున్నా ముఖ్యమంత్రికి, వారి కూటమి ప్రజా ప్రతినిధులకు కోరు కొంటున్న డిమాండ్ ఒక్కటే 2014లో రెండవ సారి రాష్ట్ర విభజన తరువాత న్యాయంగా రాయలసీమకు రావలసిన హై కోర్టు విషయమై న్యాయం జరగాలని. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఇప్పటికి రెండు సార్లు విడిపోయినా శ్రీ బాగ్ ఒప్పందం అమలు కాలేదు రాయలసీమకు న్యాయం జరగలేదు, పూర్వం మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి ఆంధ్ర రాష్ట్ర సిద్ధికి కలిసిపని చేయడానికి ఆనాడు కోస్తా, రాయలసీమ ప్రాంతాల నాయకులు కలిసి 1937లో "శ్రీబాగ్ ఒడంబడిక" ను చేసుకొన్నారు. మొదటిగా మద్రాసు నుండి విడిపోయినా తరువాత రెండవ సారి 2014లో తెలంగాణ నుండి విడిపోయినా రాయలసీమకు న్యాయం జరగలేదు, రాయల సీమకు దక్కవలసిన విభజన ఫలాలు దక్కక అన్యాయం జరుగుతునే ఉన్నది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్రీబాగ్ ఒడంబడిక ను గౌరవిస్తూ న్యాయ రాజధానిగా కర్నూలును ప్రకటించి అక్కడ హైకోర్టు ఏర్పాటుకు ఆనాటి జగన్ ప్రభుత్వం చేసిన తీర్మానమునకు వ్యతిరేకంగా కొందరు హై కోర్టులో పిటిషన్ దాఖలు చేసి కర్నూలుకు హైకోర్టు రాకుండా అడ్డుకున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కేంద్రం ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం లోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చేస్తామన్న హామీలో భాగంగా భవిష్యత్తు లో హైకోర్టు విషయమై ప్రాంతీయ విభేదాలు రాకుండా వెనుకబడిన రాయలసీమ వాసులకు శ్రీ బాగ్ ఒడంబడిక ప్రకారం కూటమి పార్టీలు టీడీపీ బీజేపీ జనసేన పార్టీలకు రాయలసీమకు న్యాయం చేయాలని డిమాండు చేస్తున్నామనీ ఆయన తెలిపారు.

### ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే

## ఎరువుల అమ్మకాలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ– సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** రైతులకు అత్యంత పారదర్శకంగా, జవాబుదా రీతనంతో సేవలం దిం చాలని, అధికార యంత్రాం గానికి సహాయ సహ కారాలు అందిస్తూ అన్నదాతలకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. ఎరువుల డీలర్లకు సూచించారు .సోమవారం కలెక్టరేట్‌లో ఎరువల డీలర్లతో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు ఎరువుల విక్రయాలు జరగాలని.. ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగు తుందన్నారు. ఎరువుల దుకాణాలకు వచ్చే రైతులకు కనీస సౌకర్యాలు కల్పిం చాలని.. నీడ సౌకర్యంతో పాటు తాగునీరు సౌకర్యం కల్పించాలన్నారు. అవసరానికి మించి యూరియాను వినియోగించకుండా అన్నదాతలకు అవగాహన కల్పిం చాలన్నారు. నానో యూరియా ప్రయోజనాల గురించి కూడా అవగాహన కల్పించి, వినియోగించేలా ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమి స్తోందని.. వివిధ రకాల పథకాలు, కాం్యక్రమాలను అమలు చేస్తోందని ఎరువుల విషయంలో డీలర్లు సహకరించి రైతులకు ఇబ్బందిలేకుండా చూడాలన్నారు. ఎరువులకు సంబంధించి అమ్మకాలు, నిల్వల సమా చారాన్ని ఎప్పటికప్పుడు అధికారులకు అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ డీలర్లకు సూచించారు. జిల్లాలో ఎరువుల పంపిణీ వ్యవస్థను కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి నిరంతరం పర్యవేక్షించడం జరుగుతోందని.. ఈ కేంద్రానికి రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులపై విచారించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, మార్క్‌ఫెడ్ డీఎం నాగమల్లిక, వివిధ కంపెనీల డీలర్లు పాల్గొన్నారు.

### చెత్తపై పన్ను వేసి..

# 85లక్షల టన్నుల చెత్త పెట్టి పోయారు

- వైసీపీపై మంత్రి నారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శలు
- డంపింగ్ యార్డ్ లో బయోమైనింగ్ పనుల్ని ఆకస్మికంగా తనిఖీ
- డంపింగ్ యార్డ్ స్థానంలో అద్భుతమైన పార్కును ఏర్పాటు చేస్తాం:మంత్రి నారాయణ
- 30ఏళ్ల డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపిస్తున్నాం: ఎమ్మెల్యే దగ్గుపాటి
- ఏపీలో 6 క్రష్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు తీసుకొస్తున్నాం: పట్టాభిరామ్





**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో చెత్త పన్ను వేసి, 85 లక్షల టన్నులు చెత్త పెట్టి పోయారని.. వైసీపీపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ విమర్శలు చేశారు. అనంతపురం డంపింగ్ యార్డ్ లో జరుగుతున్న బయోమైనింగ్ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ లతో కలిసి ఈ పనులను పరిశీలించారు. రోజుకి ఎంత చెత్త తరలిస్తున్నారు.. ఇప్పటివరకు ఎంత పూరైంది, మిగిలిన వాటిని ఎప్పటిలోగా పూర్తి చేస్తారన్నది మంత్రి నారాయణ ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ నిన్నటి వరకు 78 వేల టన్నుల చెత్తను క్లియర్ చేశారని చెప్పారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దీనిని తరలిస్తున్నట్లు చెప్పారు. ఈ డంపింగ్ యార్డ్ స్థానంలో పార్క్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి అడిగారని.. కచ్చితంగా ఇక్కడ ఒక అద్భుతమైన పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి.. కలెక్టర్ ఇతర అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో అమృత్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కింద కేంద్రం నుంచి పెద్ద ఎత్తున నిధులు వచ్చినప్పటికీ దానిని రాష్ట్ర ప్రభుత్వం తరఫున నిధులు ఇవ్వకుండా అభివృద్ధికి ఆటంకంగా మార్చా రన్నారు. ప్రస్తుతం ఈ రెండు ప్రాజెక్టుల కింద పనులు వేగంగా సాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భాగ స్వామ్యం కింద నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. 10 లక్షల కోట్ల రూపాయలు అప్పులు పెట్టి.. ఖజానా ఖాళీ చేసి వెళ్లినా.. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేసి సూపర్ హిట్ చేశామన్నారు. మిగిలిన హామీలు కూడా కొద్ది రోజుల్లోనే అమలు చేస్తామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా సమస్యగా ఉన్న డంపింగ్ యార్డ్ లో చెత్తను పూర్తిగా తరలిస్తున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం లో రెండు లక్షల టన్నుల మేర చెత్త ఉంటే.. దానిని తరలించామని రికార్డుల్లో చూపి డబ్బులు కాజేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి నారాయణ చొరవతో ఇక్కడ బయో మైనింగ్ పనులు మొదలు పెట్టమన్నారు. ప్రస్తుతం నాలుగు మిషన్లతో పనులు జరుగు తున్నాయన్నారు. ఇప్పటికే 60 శాతం చెత్త తరలించినట్లు చెప్పారు. 85 లక్షల టన్నుల చెత్తను అక్టోబర్ 2 నాటికి తరలించి డంపింగ్ యార్డ్ స్థానంలో పార్కు తీసుకొ స్తామన్నారు. దీనిపై స్థానిక ప్రజలు తమ కార్యాల యానికి వచ్చి కూడా ధన్యవాదాలు చెబుతున్నారన్నారు. నగర ప్రజలకు ఇంత మంచి చేస్తున్న మంత్రి నారాయణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. మరోవైపు స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో పేరుకుపోయిన చెత్తను తరలిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం మంత్రి నారాయణ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఇప్పటికే 90 శాతం చెత్తను ప్రాసెస్ చేసి సాలిడ్ వేస్ట్ ను సిమెంట్ ఫ్యాక్టరీలు ఇతర వాటికి తరలిస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ కింద రాష్ట్రంలో ఆరు వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లను తీసుకొస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా క్లస్టర్ల పరిధిలో ఎక్కడా చెత్త లేకుండా చేసి దేశంలోనే ఏపీని రోల్ మోడల్ గా నిలబెడుతామన్నారు. రాష్ట్రంలో ప్రతి పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా మారుస్తామని వారు స్పష్టం చేశారు.

### అనంతపురంలో చరిత్రలో

# నిలిచిపోయే విధంగా ఈ సభ ఉండాలి

- సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపు
- అర్బన్ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కీలక సమావేశం
- సమావేశంలో పాల్గొన్న కో-ఆర్డినేషన్ సభ్యులు, అబ్జర్వర్లు ఇతర ముఖ్య నాయకులు
- క్షేత్రస్థాయిలో వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలన్న దగ్గుపాటి



**అనంతపురం క్రైం – సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** అనంతపురం అర్బన్ నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోయే విధంగా సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ ఉండేలా కృషి చేద్దామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అర్బన్ టీడీపీ కార్యాలయంలో నియోజ కవర్గ కూటమి పార్టీల నాయకులు, క్లస్టర్లు, ముఖ్య నాయకులతో చంద్రగిరి ఎమ్మెల్యే పులవర్తి నాని, గిద్ద లూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్ రెడ్డి, కర్నూలు అర్బన్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అప్కాబ్ ఛైర్మెన్ గన్ని వీరాంజనేయులు, అనంతపురం నియో జకవర్గ టిడిపి పరిశీలకుడు లక్ష్మీనారాయణలతో కలిసి సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని 50డివిజన్లు, నాలుగు పంచాయతీల పరిధిలో జన సమీకరణ గురించి చర్చిం చారు. ఒక్క అనంతపురం నియోజకవర్గం నుంచే లక్ష మంది వచ్చే ప్రణాళికలు చేసినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు 164 మంది ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజర వుతు న్నారని.. దీనిని విజయం చేసే బాధ్యత మన మీద ఉందన్నారు. ఇందులో ప్రతి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ ఛార్జిలదే కీలక పాత్ర ఉంటుందన్నారు. ఎక్కడ ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు ఈ రెండు రోజులు జనం మధ్యనే ఉంటూ..సభకు వచ్చే విధంగా చూడాలన్నారు. ఎక్కడా నిర్లక్ష్యం కనిపించకూడదన్నారు. మరోవైపు క్షేత్ర స్థాయిలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారానికి తెర దించాల్సిన బాధ్యతగా మన మీదనే ఉందన్నారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని.. క్షేత్రస్థాయిలో దీనిని తిప్పికొట్టాలన్నారు. లక్ష మంది మన టార్గెట్ అని.. అంతకు మించి జనం వచ్చేలా చూసి నియోజకవర్గంలో టీడీపీ బలాన్ని చూపించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు.

# సీఎం సూపర్ సిక్స్ సభను సూపర్ హిట్ చేద్దాం

**- ఎమ్మెల్యే కందికుంట**



**కదిరి -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** ఎన్నికల హామీలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం అన్నీ నెరవేర్చుకుంటూ సూపర్ సిక్స్‌బిసూపర్ హిట్‌తో అభి వృద్ధిలో దూసుకు పోతోందని కదిరి శాసనసభ్యులు కంది కుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు ,సోమవారం కదిరి పట్టణ పరిధిలోని నాగిరెడ్డిపల్లి సమీపం లోని పివిఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్‌బిసూపర్ హిట్ కార్యక్రమం విజయోత్సవ సభకు పిలుపునిస్తూ ఎన్డీఏ కూటమి కదిరి నియోజకవర్గ విస్తృతస్థాయి సమా వేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా కదిరి శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన అనంతపురం నగరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనున్న సూపర్ సిక్స్ బిసూపర్ హిట్ విజయోత్సవ సభకు కదిరి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భారీగా తరలి రావాలని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి పరిశీలకునిగా సీని యర్ నాయకులు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, రాష్ట్ర శాప్ చైర్మన్ అమిలినేని రవి నాయుడు, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఛైర్మన్ కేకే చౌదరి, కదిరి నియో జకవర్గ పరిశీలకులు వహీద్ హుస్సేన్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పీవీ పవన్ కుమార్ రెడ్డి, జనసేన కదిరి నియోజకవర్గం ఇంచార్జ్, భైరవ ప్రసాద్, బిజెపి నాయకులు మాజీ శాసనసభ్యులు ఎమ్మెస్ పార్థసారథి, మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాదున్నిసా, మున్సిపల్ చైర్ పర్సన్ సేగు సుధారాణి, వైస్ చైర్మన్ రాజశేఖర్ ఆచారి, మున్సిపల్ కౌన్సిలర్లు, రాష్ట్ర స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్ భాను, కదిరి తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, మండల కన్వీనర్లు, క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్చార్జీలు, ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



## పీజీఆర్ఎస్ అర్జీలకు

# సకాలంలో నాణ్యతతో పరిష్కారం చూపాలి

### - జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08:** పీజీఆర్ఎస్ అర్జీలకు సకాలంలో, నాణ్యతతో పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మధుసూదన్ రావు,రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడి సర్వేయర్ భరత్ కుమార్, జి ఎస్ డబ్ల్యు ఎస్ లక్ష్మీపతి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులను నాణ్యతతో వేగ వంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిశితంగా అర్జీలను పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలోగా ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ..... ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను మరియు ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించిన జిల్లా కలెక్టర్ ఎన్నో వ్యయ ప్రయా సలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియో గించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

**పీజీఆర్ఎస్లో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు**

సంబేపల్లి మండలం నారాయణరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొండవాండ్లపల్లి కు చెందిన రేపన గోపాల్ నేను చాలా పేదవాడిని, నా కుటుంబ పోషణ కూడా చాలా కష్టంగా ఉన్నదని నాకు వృద్ధాప్య పెన్షన్ ఇప్పించవలసిందిగా జాయింట్ కలెక్టర్ కు విన్నవించుకున్నారు. చిన్నమండెం మండలము, టి.సాకిబండ గ్రామ పరిధిలోని గుంత బజార్లో కాపురముండు షేక్ అస్మత్ బి భర్త లేట్ సాహెబ్ పీర్ నా రేషన్ కార్డు నెంబరు 2806193012, నా భర్త మరణించినారు. నా కుమారుడు జీవినోపాదికి సౌదికి పోయి ఇటీవల ఇండియాకు వచ్చినాడు. నా కుమారుడు మరియు నా కోడలు గొడవలు పడి కోర్టులో కేసు వేసుకున్నారు.నాకు పించను రాకుండా చేయాలనే ఉద్దేశ్యముతో మాకు తెలియకుండా నా కోడలు మాకు రేషన్ కార్డు అవసరములేదని, మా రేషన్ కార్డు క్యాన్సిల్ చేయమని పెద్దమండ్యం తహశీల్దారు వారికి మా రేషన్ కార్డు సరండరు చేసినది. నాకు ఆసుపత్రి ఖర్చులకు మందులకు, మాత్రలకు ఈ పించను డబ్బులే ఆధారము కావున నా మీద దయవుంచి మా రేషన్ కార్డును రద్దు పరచకుండా మా రేషన్ కార్డును, వితంతు పెన్షన్ కొనసానగనించ వలసినదిగా కోరుతూ జాయింట్ కలెక్టర్ కు విన్నవించుకున్నారు.

తుమ్మలపల్లి మండలం జంజుపెంట గ్రామం పరిధిలోని గంజికుంటకు చెందిన ఎస్. వెంకటరమణమ్మ నాకు రెండు నెలల క్రితం వితంతు పింఛన్ మంజూరు అయిందని, నేను ఆశా వర్కర్ అయినందువలన నాకు పెన్షన్ ఇవ్వకుండా హెూల్డ్ లో పెట్టారని తెలిసింది. నాకు ముగ్గురు పిల్లలు ఉన్నారని వారిని పోషించడం చాలా కష్టంగా ఉందని కావున తమరు నాపై దయ తో వితంతు పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరుతూ జాయింట్ కలెక్టర్ కు విన్నవించుకున్నారు.

రాజంపేట మండలం రామ్ నగర్ కాలనీ కు చెందిన పసుపులేటి సుబ్బమ్మ భర్త లెట్ చలమయ్య తేదీ 8.5.2009 న మరణించడం జరిగిందని, నాకు ఎలాంటి స్థిర, చర ఆస్తులు లేవని కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నానని నాకు వితంతు పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరుతూ జాయింట్ కలెక్టర్ కు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కు పలు ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ జాయింట్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## గ్రంథాలయంలో 58వ

# అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం



**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** శాఖా గ్రంధాలయం నందిగామ నందు 58వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సోమ వారం నాడు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డిప్యూటీ తాసిల్దార్ నాంపల్లి అప్పారావు విచ్చేసి సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలవేసి, అక్షరాస్యత దినోత్సవం గురించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. రిటైర్డ్ హెడ్మాస్టర్, రాష్ట్ర బెస్ట్ టీచర్ అవార్డు గ్రహీత, కే రాజగోపాల్ రావు, రిటైర్డ్ వెటర్నరీ ఆఫీసర్ ఆత్కూరు ఆంజనేయులు, జిల్లా పరిషత్ హై స్కూల్ సోషల్ మాస్టర్, ఆరుద్ర కొండ, తెలుగు మాస్టారు వై శ్రీనివాసరావు, వేదిక నాలంకరించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించినారు, ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా గ్రంథాల అధికారి, అల్లూరు రామచంద్రుడు వహించినారు. వేదికను అలంకరించిన పెద్దలు విద్యార్థులు ఉద్దేశించి అంతర్జాతీయ అక్షరాస్య దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను తెలియజేసినారు. యునెస్కో వారు 1966 అక్టోబర్ 26న ప్రపంచంలో ఉన్న అన్ని దేశాల విద్యాశాఖ మంత్రులతో సమావేశమై, ఆర్థికంగా వెనుకబడిన దేశాలు అక్షరాజిత తక్కువ ఉండటం కారణంగా పేదరికం అనుభవిస్తున్నారని, అక్షరాజిత పెంచినట్లయితే దేశ అభివృద్ధికి దోహదపడుతుందని, 1967 సంవత్సరాల సెప్టెంబర్ 8న మొదటి అంతర్జాతీయ అక్షరాహిత దినోత్సవం నిర్వహించినారు, 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రపంచ అక్షరాచిత 84% ఉన్నది, భారతదేశ అక్షరచిత 74. 04%, ఉన్నది మన దేశంలో అత్యధిక అక్షరార్చిత కలిగిన రాష్ట్రం కేరళ 94.1 % అత్యల్ప రాష్ట్రం బీహార్ 61.8%. ఐక్య సమితి వారు 2003- 2012 దశాబ్ద కాలనీ అక్షరాస్యత దశాబ్దంగా ప్రకటించినారు. ప్రకటించిన గ్రంథాల అధికారి రామచంద్ర తెలిపారు.

## జయప్రద ఫౌండేషన్ ద్వారా

# ఉచిత వైద్య సేవలు





**విజయవాడ- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 8:** నందిగామ మండలం గోళ్ళముడి గ్రామంలో సోమవారం నాడు జయప్రద ఫౌండేషన్ ద్వారా సొసైటీ అధ్యక్షులు గాడిపర్తి శ్రీని వాసరావు వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారుగా 300 మందికి పైగా కంటి పరీక్షలు, సాధారణ అనారోగ్యాలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేసి ఉచితంగా కళ్ళ జోళ్ళు అందజేశారు. గోళ్ళముడి గ్రామ ప్రజలకు జయప్రద ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉందని జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తొండెపు దశరథ జనార్ధన్ వారికి గోళ్ళముడి గ్రామ సొసైటీ ఛైర్మన్ గాడిపర్తి శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా. నందిగామ మండలం ప్రధాన కార్యదర్శి తోట నాగమల్లేశ్వరరావు (బుజ్జి), బత్తిన రవి, తొర్రగుడిపాడు సర్పంచ్ చెరుకూరి హైమారావు, మాజీ ఎంపీపీ. మన్నెం కళావతి, మాగల్లు సొసైటీ ఛైర్మన్ అప్పారావు గ్రామ నాయకులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా నిలువలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో

# సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

### - క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ కు హాజరైన జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08:** రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం యూరియా నిలువలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి తన క్యాంపు కార్యాలయం నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాట్లాడుతూ... రాష్ట్రంలో అన్ని జిల్లాలలో అవసరమైన యూరియా నిలువలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా నిలువలపై తప్పుడు సమాచారాన్ని ఇస్తూ రైతులను రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్... యూరియా నిలువలపై రైతులకు సమాచారాన్ని ఇచ్చేం దుకు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్, ఈరోజు నాటికి జిల్లాలో ప్రైవేటు డీలర్లు , రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉన్న యూరియా నిలువలపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి , మార్కెటింగ్ శాఖ అధికారులకు వివిధ సూచనలు చేశారు.




## శ్రీ శివ నర్సింగ్ కాలేజ్లో

# 10వ తేదీన మెగా జాబ్ మేళ

### - మెగా జాబ్ మేళా పోస్టర్ను ఆవిష్కరించిన డి.ఆర్.ఓ మధుసూధన్రావు




**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08:** సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం డిఆర్ఓ మధుసూదన్ రావుతో కలిసి రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఏడి సర్వేయర్ భరత్ కుమార్, జి ఎస్ డబ్ల్యు ఎస్ లక్ష్మీపతి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి దాసరి నాగార్జునతో కలిసి మెగా జాబ్మేళా పోస్టర్ను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏపీస్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లాలోని, రాయచోటిలోని, శ్రీశివ నర్సింగ్ కాలేజ్ లో ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీ దాసరి నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళ ఈ నెల 10వతేదిన నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగమేళలో Axis Bank, ICICI Bank, Shiridi Sai Electricals, Comett Staff Solutions, NTEXT Transportaion Pvt Ltd, TATA Electronics, Apollo Pharmacy, Young India, AIL DIXON, Sriram chits... తదితర కంపనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. కావున జిల్లాలోని ఆసక్తి, ఉన్నటువంటి యువతీ యువకులు ఈ క్రింది ఉద్యోగ మెళను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు.

**ఉద్యోగ మేళ జరుగు ప్రదేశం**

శ్రీశివ నర్సింగ్ కాలేజ్, రాయచోటి, అన్నమయ్య జిల్లా తేదీ 10-09-2025, గమనిక: ఆసక్తిగల అభ్యర్థులు క్రింద తెలుపబడిన లింక్ నందు రిజిస్ట్రేషన్ చేసుకోగలరు. రిజిస్ట్రేషన్లింక్: https: //naipunyam. ap.gov. in/user-registration, మరిన్ని వివరములకు 9550104260, 9177143181 - 8897776368 నంబర్లను సంప్రదించగలరు.

## రైతులకు సకాలంలో ఎరువులు

# సరఫరా చేయాలని సీపీఐ ధర్నా

**గుత్తి -సూర్య వాస్తవం, సెప్టెంబర్ 08:** గుత్తి పట్టణంలో రైతులకు సకా లంలో ఎరువులు అందుబాటు లోకి తేవాలని డిమాండ్ చేస్తూ భారత కమ్యూని స్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో గుత్తి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు యూరియా, ఇతర ఎరువులు,పురుగు మందులు లభ్యం కాక ఇబ్బందులు పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. మరోవైపు దళారులు, ఎరువుల వ్యాపారులు ప్రభుత్వ నిర్ణయించిన ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నారని విమర్శించా రు. ప్రభుత్వం నిర్ణయించిన రేటు రూ.260 కాగా, బ్లాక్ మార్కెట్లో రూ.100-150 అదనంగా వసూలు చేస్తున్నారని, కొన్నిచోట్ల అధి కారులు దాడులు చేసి దుకాణాలను సీజ్ చేసిన ఘటనలు ఉన్నా యని తెలిపారు. జిల్లాకు ప్రభుత్వం 871 మెట్రిక్ టన్నుల యూరియాను విడుదల చేసినట్లు తెలి సిందని, ఈ ఎరువులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఆర్డీవో, ఎమ్మార్వో పర్యవేక్షణ లో రైతులకు అందించాలన్నది వారి డిమాండ్. ప్రతి ఎకరాకు 200కిలోల చొప్పున రైతుకు ఐదు బస్తా లు అందేలా చర్యలు తీసు కోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ పార్టీ మండల కార్యదర్శి రాందాస్, పట్టణ కార్యదర్శి రాజు యాదవ్, సహాయ కార్యదర్శి నజీర్, రైతు సంఘం నియోజ కవర్గ అధ్య క్షుడు వెంకట్రాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట నాయక్,మండల నాయకులు మ ధుసూదన్రావు, సీనియర్ నాయకులు డానియల్ గోపాల్,షఫీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )